

ఉష్ణోగ్రత (అంచనా)

2-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	39	29
రెంటచింతల	40	28
చీరాల	39	28

పంట రుణాలు రూ.27,390.14 కోట్లు

సిద్ధమైన వ్యవసాయ ప్రణాళిక

- పంటలన్నింటికీ పెరిగిన పరపతి
- వారం రోజుల్లో ఏరువాక ప్రారంభం
- మిరప పంట ఎకరాకు రూ.1.47 లక్షలు
- వరికి రూ.52 వేలు.. పత్తికి రూ.55 వేలు

వరుణుడి పలకరింపుతో... రైతు పులకరించాడు. సాగుకు సమాయత్త మవుతున్నాడు. మరో వారంలో ఏరువాక రానున్నది. దీంతో ప్రభుత్వం జిల్లాల వారీగా రుణాల లక్ష్యం ప్రకటించింది. ఈ మేరకు తప్పనిసరిగా బ్యాంకర్లు రైతులకు వ్యవసాయ రుణాలు అందజేసి ఆదుకోవాలని ఆదేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో 14.72 లక్షల మంది రైతులకు రుణాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంట రుణాల లక్ష్యం రూ.27,390.14 కోట్లుగా నిర్ధారించారు. ఖరీఫ్, రబీలో పంట రుణాల లక్ష్యాన్ని జిల్లాల వారీగా లీడ్ బ్యాంకు నిర్ణయించింది. సాగు వ్యయం ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో పంటలకు పరపతిని కూడా పెంచారు. దరఖాస్తు చేసిన వెంటనే రుణం మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నరసరావుపేట ప్రాంతంలో దుక్కి దున్నుతున్న రైతు

(నరసరావుపేట, గుంటూరు - ఆంధ్రజ్యోతి)
రుతు పవనాలు విస్తరిస్తున్నాయి. వరుణుడి పలకరింపుతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఏరువాక రోజున రైతులు పుడమి తల్లికి పూజలు చేసి రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. పొలాల్లో దుక్కులు దున్నే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు విత్తన సేకరణలో నిమగ్నమైన రైతులు సాగుకు రుణాల కోసం బ్యాంకులకు దరఖాస్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. జిల్లాల వారీగా పంటలకు పరపతి పంపిణీ లక్ష్యాలను నిర్దేశించి లీడ్ బ్యాంకులు ఉత్తర్వులను బ్యాంకులకు జారీ చేశాయి. జూలై 15న సాగునీరు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కౌలు రైతులకు గత ఏడాది కంటే అధికంగా రుణ అర్హత కార్డులు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అయితే సాగుకు కౌలు రైతులు సిద్ధమవుతున్నా వీరిని గుర్తించే ప్రక్రియ (మిగతా 6వ పేజీలో)

జిల్లాల వారీగా లక్ష్యం ఇలా..

జిల్లా	రైతులు	లక్ష్యం(కోట్లలో)
పల్నాడు	6,01,656	10,589.32
బాపట్ల	3,94,041	7,194.69
గుంటూరు	4,76,804	9,606.13

రుణాలు ఇలా..

పంట రకం	మొత్తం (ఎకరాకు)
పసుపు	రూ.22 వేల నుంచి 27 వేలు
మొక్కజొన్న	రూ.45 వేల నుంచి రూ.47 వేలు
పొగాకు(వర్జీనియా)	రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షలు
పొగాకు(నాటు)	రూ.42 వేల నుంచి రూ.46 వేలు
కంది	రూ.26 వేల నుంచి రూ.30 వేలు
మినుము	రూ.26 వేల నుంచి రూ.30 వేలు
పెసర	రూ.22 వేల నుంచి రూ.25 వేలు
శనగ	రూ.34 వేల నుంచి 37 వేలు



రైల్వే ప్రాజెక్టులు.. రయ్‌రయ్

- గుంటూరు డివిజన్‌కు రూ.926.53 కోట్లు
- అమరావతి రాజధాని రైలుమార్గానికి నిధులు
- పనులను ముందుకు తీసుకెళ్లేలా నిధులు వచ్చాయంటున్న రైల్వేవర్గాలు

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రాజెక్టులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వే బోర్డు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. మొత్తం ఐదు ప్రాజెక్టులకు రూ.926.53 కోట్ల మంజూరయ్యా యని తేలింది. నిధుల కేటాయింపుతో శరవేగంగా పనులు చేపట్టే అవకాశం ఉందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అమరావతి రాజధానికి నూతన రైలుమార్గాన్ని గత ఎన్‌డీఏ-1 ప్రభుత్వంలోనే కేటాయించింది. అయితే నిధుల కొరతతో దీనిని దాదాపుగా ఎనిమిదేళ్లకుపైగా అటకెక్కించారు. గత సంవత్సరం ఎన్‌డీఏ-3 ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టులో కదలిక ప్రారంభమైంది. ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు అమ రావతి మీదగా రైలుమార్గం నిర్మాణానికి రూ.2047 కోట్లతో ప్రాజెక్టుని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో తొలివిడతగా ఈ ఏడాది రూ.170.80 కోట్లు రైల్వేబోర్డు ఇచ్చింది. దీంతో త్వరితగతిన భూసేకరణని పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఆస్కారం ఏర్పడింది.

- గుంటూరు - బీబీనగర్ రూట్‌లో 100 శాతం పైగా సామర్థ్యంతో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. 248 కిలోమీటర్ల పొడవునా రెండో రైలుమార్గాన్ని నిర్మించాల్సి ఉన్నది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2853.23 కోట్లు కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వేబోర్డు రూ.452.36 కోట్లు కేటా యించింది.
- గుంటూరు రైల్వేస్టేషన్ యార్డు రీమోడలింగ్‌ని రూ.120 కోట్లతో రైల్వే శాఖ చేపట్టింది. దీనికి కూడా రైల్వేబోర్డు ప్రాధాన్యం కల్పిస్తూ ఈ ఏడాది రూ.71.63 కోట్ల నిధులను విడుదల చేసింది.
- నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గానికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పని ఎప్పుడో పూర్తి అయింది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో దర్శి నుంచి కనిగిరి వరకు నిర్మాణ పనులు కొనసాగుతున్న పనులకు రూ.170.80 కోట్లు కేటాయించింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ మార్గంలో దిగువమెట్ట - నంద్యాలఘాట్ సెక్షన్ పనులకు రూ.148.76 కోట్లు కేటాయించారు.

నాగార్జునకొండలో.. పర్యాటకుల సందడి

మాచర్ల రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు, ఆదివారం కావడంతో ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు మండలంలోని విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు లాంచీల్లో ప్రయాణించారు. మ్యూజియంలోని బుద్ధుడి ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుడి పాలరాతి విగ్రహం, మహాస్థూపం, అశ్వమేధ యజ్ఞశాల, స్నానాల ఘాట్, బోధి వృక్షం తదితరాలను సందర్శించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా రూ.46,600 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



లాంచీ స్టేషన్‌లో పర్యాటకులు



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, స్టెప్ సీఈవో చంద్రముని

సైక్లింగ్‌తో శారీరక ఆరోగ్యం

సైకిల్ ర్యాలీలో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు(తూర్పు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్‌ను దినచర్యగా చేసుకుంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పెరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్టెప్, క్రీడాప్రాధికార సంస్థ, శ్లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కళాశాల నుంచి శిల్పారామం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ఒత్తిడిని దూరం చేసే మంచి వ్యాయమం సైక్లింగ్ అని అన్నారు. స్టెప్ సీఈవో చంద్రముని మాట్లాడుతూ సైక్లింగ్‌తో ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. యువత బైక్‌లకు దూరంగా ఉండి సైక్లింగ్ అలవాటు చేసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో సతీష్‌కుమార్, చంద్రమునిలు స్వయంగా పాల్గొని చిన్నారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో నరసింహారెడ్డి, శ్లోక ఫౌండేషన్ అధ్యక్షుడు గంటస్వామి, ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఫౌండర్ విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

6 బదిలీలపై... ఉత్కంఠ

- వాణిజ్య పన్నుల శాఖలో విడుదల కాని మార్గదర్శకాలు
- సమీపిస్తున్న నిషేధం గడువు
- ఉద్యోగుల్లో ఆందోళన

6

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

- 2,277 మంది అభ్యర్థుల గైర్హాజరు

క్రీడల్లో గురువుల పాత్ర కీలకం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

తప్పిన తిప్పలు

దుకాణాల వద్దే రేషన్ పంపిణీ

- రేషన్ షాపులకు క్యూ కట్టిన లబ్ధిదారులు
- డోర్ డెలివరీ చిక్కులు తప్పాయంటూ హర్షం
- సరుకులు అందజేసిన ఎమ్మెల్యేలు, అధికారులు



వసంతరాయపురంలో ఈ- పోస్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఏ. భార్గవతేజ

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ వీధికి రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక.. రోడ్డుపై క్యూలో నిల్చోలేక.. బియ్యం అందుతుందా లేదా అన్న ఆందోళనలకు చెక్‌పడింది. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి పాత విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆదివారం నుంచి రేషన్ సరుకుల పంపిణీని డీలర్ల వద్దే చేపట్టింది. దీంతో లబ్ధిదారులు రేషన్ తిప్పలు తప్పాయన్న ఆనందంతో డీలర్ల దుకాణాల వద్ద క్యూ కట్టారు. ఇక నుంచి తమకు కుదిరినప్పుడు సరుకులు తెచ్చుకోవచ్చని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలానికి కార్డుదారులకు కష్టాలు తప్పాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎట్టకేలకు ఈ నెల ఒకటో తేదీ నుంచి పాత విధానాన్నే అమల్లోకి తెచ్చింది. తొలిరోజే పెద్దసంఖ్యలో కార్డుదారులు షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్లి డీలర్ల వద్దే సరుకులు తెచ్చుకునే వీలు కల్పించారు.



బారులు తీరిన ప్రజలు

ఎక్కడికక్కడ ప్రారంభించిన ఎమ్మెల్యేలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునరుద్ధరించిన కార్యక్రమం కావడంతో తొలిరోజు ఆదివారం పలు నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు రేషన్ షాపులకు వెళ్లి సరుకుల పంపిణీని ప్రారంభించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అధికారులు కూడా ఎక్కడికక్కడ రేషన్ దుకాణాలకు వచ్చిన కార్డుదారులకు స్వయంగా సరుకులు అందజేశారు. గుంటూరులో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ వసంతరాయపురంలో సరుకుల పంపిణీని ప్రారంభించారు. రేషన్ అక్రమాలను కట్టడి చేయడంలో తొలి అడుగు పడిందని ఈ సందర్భంగా వారు చెప్పారు.

వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే సరుకులు

దివ్యాంగులు, 65 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు రేషన్ సరుకులను ఇళ్లకు తీసుకువెళ్లి అందించేందుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎక్కడికక్కడ ఆ బాధ్యత డీలర్లకే అప్పగించారు. అయితే వారు ఎండీయూ వాహనాలు వినియోగించరాదు. ఇలా గుంటూరు జిల్లాలో 67,052 దివ్యాంగులు, వయోవృద్ధుల కార్డులు ఉండగా వారికి ప్రత్యేకంగా సరుకులు అందించేందుకు డీలర్లు సమాయత్తమవుతున్నారు. ఇదేవిధంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా డీలర్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు

మాదక ద్రవ్య రహిత భారతావనిని సాధిద్దాం

నషా ముక్త్ భారత్ అభియాన్ మారథాన్‌లో ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు ముఖ్యంగా యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కలెక్టరేట్ నుంచి హిందూ కళాశాల సర్కిల్ వరకు మినీ మారథాన్ జరిగింది. కలెక్టరేట్ వద్ద మారథాన్‌ను ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే అనార్థాలు గురించి అవగాహన పెంచడానికి, మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిరోధానికి ఈగల్ టాస్క్‌ఫోర్స్ ద్వారా అవగాహనతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలను పోలీస్‌శాఖ అమలు చేస్తుందన్నారు. వ్యసనాలకు బానిసైన వారికి డీఎడిక్షన్ సెంటర్లో చికిత్సను అందిస్తున్నారన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా యువతకు వాటి వల్ల కలిగే అనర్థాలపై పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాయన్నారు. సమష్టి కృషితో మాదక ద్రవ్య రహిత భారతావనిని సాధిద్దామని ఎస్పీ పిలుపిచ్చారు. మాదక ద్రవ్య రహిత యువత జనాభాను పెంపొందించడం, తద్వారా జాతీయ అభివృద్ధి, సామాజిక శ్రేయస్సు లక్ష్యంగా ప్రతి ఒక్కరు మాదక ద్రవ్య రహిత భారత్ సాధనపై దృష్టి సారించాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ కల్యాణి, నర్సింగ్ విద్యార్థులు, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్

ఎఫ్‌సీఐ ఏపీసీసీ చైర్మన్‌గా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంప్రదింపుల కమిటీ చైర్మన్‌గా నరసరావుపేట ఎంపీ, పార్లమెంట్‌లో టీడీపీ ఫ్లోర్‌లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు నియమితుల య్యారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. ఎఫ్‌సీఐఏసీసీ చైర్మన్‌గా ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఆహార, ధాన్యం సేకరణ, ఇతర పంటల ఉత్పత్తులు, గోడౌన్లలో నిల్వలు, ఆహార పదార్థాల నాణ్యత, రవాణా, స్టోరేజ్ నష్టాలు తదితర అంశాలను పర్య వేక్షిస్తారు. ఏమైనా మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే కేంద్రానికి సిఫార్సులు చేస్తారు. ఈ కమిటీలో ఎంపీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సెక్రటరీ స్థాయి అధికారి, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే నాన్-అఫిషియల్ సభ్యులు ఉంటారు. మెంబర్ సెక్రటరీగా ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ వ్యవ హరి స్తారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ కమిటీ సమా వేశమై చర్చిస్తుంది. ప్రొక్యూర్‌మెంట్, స్టోరేజ్, డిస్ట్రిబ్యూషన్ ఆపరేషన్స్‌ని పర్యవేక్షించే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. తిండి గింజల నాణ్యత గురించి ఏమైనా ఫిర్యాదులు వస్తే గిడ్డంగులను తనిఖీ చేయొచ్చు. కాగా ఎంపీ శ్రీకృష్ణదేవరా యలుకు కేంద్రం ఈ పదవి ఇవ్వడంపై టీడీపీ నేతలు, శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

చెల్లింపులకు చిక్కులు

- రైతులను వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు
- గత ప్రభుత్వ హయాంలో లోపాలే.. శాపాలు
- నిర్దేశిత లక్ష్యాలకు దూరంగా నీటి తీరువా వసూళ్లు

అస్తవ్యస్తంగా శిస్తు విధానం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
సాగునీటి రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా పడకేయించింది. ఈ క్రమంలోనే నీటి తీరువా వసూళ్లను కూడా విస్మరించింది. ఆయకట్టు సాగును కంప్యూటరీకరణ చేసే పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన హడావిడి ఇప్పుడు నీటి తీరువా చెల్లింపులకు ప్రతిబంధకంగా మారింది. గతంలో నీటి తీరువా శిస్తు చెల్లించినా ఇప్పటికీ బకాయిలు చూపడం ఒక ఎత్తయితే చెల్లించాల్సిన మొత్తం కన్నా ఆన్‌లైన్‌లో అదనంగా చూపడం వంటి విచిత్రాలు వెలుగులోకి వస్తున్నాయి. 2020 వరకు మాన్యువల్ విధానంలో జరిగే నీటి తీరువా చెల్లింపులను గత ప్రభుత్వం ఆన్‌లైన్ పేరిట ప్రక్రియను అస్తవ్యస్తం చేసింది. శిస్తు చెల్లించడానికి రైతులు సిద్ధంగా ఉన్నా సాంకేతిక చిక్కుల వల్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నీటి తీరువా వసూళ్లలో ఇప్పటి వరకు 40 శాతం కూడా చేరుకోలేదు. నీటి తీరువా వసూళ్లలో ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా (మిగతా 6వ పేజీలో)

పంట రుణాలు.. రూ.27,390.14 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఇంకా ప్రారంభం కాలేదు.

వ్యయానికి అనుగుణంగా..

ఏటేటా పెరుగుతున్న సాగు వ్యయానికి అనుగుణంగా పంటలకు పరపతిని పెంచారు. పంటల వారీగా ఏ పంటకు ఎంత రుణం మంజూరు చేయాలనేది అధికారులు నిర్ధారించారు. వరి సాగు వ్యయం ఎకరాకు రూ.43,000 అవుతుందని అంచనా వేశారు. ధాన్యం దిగుబడి ఎకరాకు రూ.58,000గా నిర్ధారించారు. ఈ మేరకు వరి సాగు ఎకరాకు ఖరీఫ్‌లో రూ.46,000 నుంచి 52,000 రుణం ఇవ్వాలని బ్యాంకులకు లీడు బ్యాంకు సూచించింది. రబీలో వరి సాగుకు ఎకరాకు రూ.50 వేలు నుంచి 55 వేలు రుణం మంజూరు చేయనున్నారు. పత్తి ఎకరాకు సాగు వ్యయం రూ.45,500 అవుతుందని అంచనా వేశారు. ఎకరాకు రూ.75,210 విలువైన పత్తి దిగుబడి ఉంటుందని అంచనా వేశారు. పత్తి సాగుకు ఎకరాకు రూ.48 వేలు నుంచి 55 వేలు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. బోర్లు, కాల్వల కింద మిరప సాగుకు వ్యయం రూ.1,47,400,దిగుబడి రూ.3,38,000,వర్షాధార పొలాల్లో వ్యయం రూ.88,500, దిగుబడి రూ.2,00,000 అవుతుందని అంచనా వేశారు. మిరపకు ఎకరాకు రూ.1.50 లక్షల రూ.1.75 లక్షలు వరకు రుణం ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంకు ప్రకటించింది.

సాగునీటిపై.. ఆశలు

శ్రీశైలానికి 31,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సకాలంలో పంటలకు నీటి విడుదలకు అవకాశం

రోహిణీకార్తెలోనూ జలాశయాలకు వరద పోటెత్తుతోంది. కర్ణాటకలో కురుస్తోన్న వర్షాలకు శ్రీశైలం ప్రాజెక్టుకు 37 వేల క్యూసెక్కులకు పైగా వరదనీరు వచ్చి చేరుతుంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పైగా ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఖరీఫ్ సాగుకు సకాలంలో సాగునీటి విడుదల జరుగుతుందని సాగర్ కుడి కాల్వ, కృష్ణా పశ్చిమ డెల్టా రైతులు ఆశిస్తున్నారు. ఏటా జూలై మొదటి వారంలో కృష్ణా డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తారు. అయితే ఈ సంవత్సరం కొన్ని రోజులు ముందుగానే విడుదల చేసేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతోన్నది. ఇప్పటికే శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో మొదలైంది. శనివారం ఉదయం ఒక దశలో 70 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో వెళ్లి ఆ తర్వాత మధ్యాహ్నానికి 37,870 క్యూసెక్కులకు తగ్గింది. వరద పెరుగుతుందని విద్యుత్ ఉత్పాదన చేసి 10,176 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు కూడా విడుదల చేశారు. ఆదివారం వరద 31,425 క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ ఉత్పాదనని కూడా తగ్గించారు. దీంతో సాగర్‌కు 8,046 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం నుంచి మాత్రమే వరదనీరు వస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి కూడా వరద వస్తే వేగవంతంగా శ్రీశైలం నిండి నాగార్జునసాగర్ దిశగా కృష్ణమ్మ ఉరకలేయనున్నది.

చెల్లింపులకు.. చిక్కులు

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అదేమీ కనబడడం లేదు. శిస్తు చెల్లింపులో అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కానీ, సాంకేతిక తప్పులను సవరించడంలో యంత్రాంగం నిర్లక్ష్యం కూడా వసూళ్ల మందకొడిగా సాగడానికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికి వసూలైంది రూ.3.80 కోట్లు

ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకి శిస్తు రూ.200 చెల్లించాలి. కృష్ణా పశ్చిమ డెల్టా కింద మొత్తం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5,58,500 ఎకరాల ఆయకట్టు ఉండగా నీటి తీరువా రూ.29 కోట్లుగా రెవెన్యూ విభాగం చెబుతోంది, ఒక్క బాపట్ల జిల్లాలో చూస్తే ఆయకట్టు 3,80,000 ఎకరాలు కాగా శిస్తు వసూలు లక్ష్యం రూ.20 కోట్లుగా ఉంది. అయితే ఇప్పటి వరకు వసూలైంది రూ.3.80 కోట్లు మాత్రమే. ఇప్పటికే కాలువల మరమ్మత్తుల పనులకు ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నీటి తీరువా వసూళ్లనే ఆ పనులకు ఖర్చు పెట్టాలని నిబంధనలు చెబుతున్నా ఖరీఫ్ గడువు ముంచుకొస్తున్నందున తొలుత కాల్వలను బాగు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే నిధులను విడుదల చేసిందని, తీరువా వసూలు లక్ష్యాలు చేరుకున్నాక ఆ మొత్తాలను తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరుగుతుందని యంత్రాంగం చెబుతోంది.

బదిలీలపై... ఉత్కంఠ

● వాణిజ్య పన్నుల శాఖలో విడుదల కాని మార్గదర్శకాలు
● సమీపిస్తున్న నిషేధం గడువు ● ఉద్యోగుల్లో ఆందోళన



వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం

గుంటూరు, జూన్1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల వ్యవహారం ఉత్కంఠ రేకెత్తిస్తోంది. బదిలీల నిషేధం గడువు సమీపిస్తోన్నా నేటికీ మార్గదర్శకాలు విడుదల కాకపోవడం ఉద్యోగుల్లో టెన్షన్ పుట్టిస్తోంది. పరిపాలన సౌలభ్యంలో భాగంగా ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. బదిలీల గడువు సమీపిస్తున్నా.. నేటికీ మార్గదర్శకాలు విడుదల కాకపోవడంపై ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమిషనర్ ఎ.బాబు విదేశీ పర్యటన నేపథ్యంలో ఇన్‌చార్జి చీఫ్ కమిషనర్‌ను నియమించారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ రీజినల్ కార్యాలయాలకు గుంటూరు జోన్ పరిధిలోని ఉద్యోగులను కేటాయించారు. ఫలితంగా జోన్ పరిధిలోని గుంటూరు-1, 2తో పాటు ఒంగోలు, నెల్లూరు డివిజన్ల ఉద్యోగులు పలువురు అక్కడికి బదిలీపై వెళ్లాల్సి వచ్చింది.

సొంత డివిజన్‌లపై ఆశలు..

తాజా బదిలీల్లోనైనా ఆర్‌వో కార్యాలయాలకు వెళ్లిన ఉద్యోగులు తిరిగి సొంత డివిజన్‌లకు రావచ్చన్న ఆశల్లో ఉన్నారు. బదిలీల్లో తాము కోరుకున్న స్థానాలకు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గుంటూరు జోన్ పరిధిలో నాలుగు డీసీటీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతున్నారు. అలానే 11 జీఎస్‌టీవో పోస్టులకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి ఉంది. బదిలీలపై ఆర్‌వో కార్యాలయాలు, ఇతర డివిజన్‌ల నుండి అర్హులైన జీఎస్‌టీవోలు రావాల్సి ఉండగా, మరో ఐదుగురికి ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

గడువు పొడిగించే అవకాశం

వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల బదిలీలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పన్నుల వసూళ్లలో తలమునకలవుతున్న నేపథ్యంలో బదిలీలు ఇప్పుడు నిర్వహించే పరిస్థితి లేదని చెబుతున్నారు. ప్రభుత్వ అనుమతితో ప్రత్యేకంగా బదిలీల ప్రక్రియ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆలోచనలో ఉన్నట్లు ఆశాఖ వర్గాలు తెలిపాయి. ప్రత్యేకంగా మార్గదర్శకాలతో బదిలీల కార్యక్రమం నిర్వహించాలని ఉన్నతాధికారులు తలంపుతో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

వైసీపీ హయాంలో దుర్మార్గాలపై.. జగన్‌కు లేఖరాస్తా

● అప్పుడు తప్పులు చేసి, ఇప్పుడు మాపై నిందలా
● ఐదేళ్ల పాలనలో అట్టడుగు స్థాయిలో గురజాల అభివృద్ధి
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



వైసీపీ నేతలు చేసిన అరాచకాలను చూపుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అధికారం ఉందని గత ఐదేళ్ల అడ్డగోలుగా గురజాల నియోజకవర్గంలో అరాచకాలకు పాల్పడి, ఆడబిడ్డలపై అసత్య పోస్టులు పెట్టిన వారిని పోలీసులు విచారిస్తుంటే వైసీపీ నేతలు తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనని గోల చేస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు చేసిన అరాచకాలు, దుర్మార్గాలు చూసేందుకు గురజాలకు రావాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు లేఖ రాస్తానని యరపతినేని తెలిపారు. గత ఐదేళ్ల గురజాల నియోజకవర్గంలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయని కాసు మహేష్‌రెడ్డి, నర్సరావుపేటలో మాత్రం ప్రాజెక్టును పూర్తి చేసుకున్నాడన్నారు. వైసీపీ నేతల నాసిరకం మద్యంతో ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని, వేల మంది చనిపోయారన్నారు. పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయాన్ని ఆగస్టు లోపు పూర్తి చేస్తామని, టిడ్కో ఇళ్లపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని యరపతినేని తెలిపారు. 90 శాతానికిపైగా మెడికల్ కళాశాల పనులు పూర్తి అయ్యాయని వైసీపీ నేతలు వీడియోలు రిలీజ్ చేస్తున్నారని, పనులు ఎంత శాతం పూర్తి అయ్యాయో తెలుసుకునేందుకు త్వరలోనే మెడికల్ కళాశాలను సందర్శిస్తామన్నారు. రెండేళ్ల లోపు జానపాడు రోడ్డు ఆర్‌వోబీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ఐదేళ్ల లింకు రోడ్లు ఒక్కటి కూడా పూర్తి చేయలేదని తెలిపారు. మేజర్లు, మైనర్ల మరమ్మతులకు ఇప్పటికే రూ.2 కోట్ల నిధులు మంజూరు కాగా, మరో రూ. 2 కోట్లు వచ్చాయన్నారు. డీఎంఎఫ్ ఫండ్‌తో గత ఐదేళ్లు.. ఒక్క కమ్యూనిటీ హాల్, బ్రిడ్జి కూడా ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం పది నెలల్లో పిడుగురాళ్ల, జానపాడుతోపాటు మరికొన్ని గ్రామాల్లో కాపు, కాకతీయ, బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయని వివరించారు. ఇప్పటికే మూడు మున్సిపాలిటీలకు రూ. 300 కోట్లు మంజూరు అయ్యాయని, తాజాగా గురజాల, పిడుగురాళ్లలకు రూ. 10 కోట్లను మున్సిపల్ మంత్రి నారాయణ కేటాయించారని చెప్పారు.

వైసీపీ ట్రాప్‌లో పడొద్దు

వైసీపీ కార్యకర్తలు, నాయకులు చెప్పినట్లు చేసి వారి ట్రాప్‌లో పడొద్దని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచించారు. రెచ్చగొట్టి దాడులకు, గొడవలకు పాల్పడేలా చేసి, వారే కేసులు నమోదు చేయించి, వారందరిని తమ వెంట ఉండేలా వైసీపీ నేతలు క్రిమినల్ ఆలోచనలో ఉన్నారని ఆయన హెచ్చరించారు. వైసీపీ కార్యకర్తలు తమ పనులు తాము చేసుకుంటూ హాయిగా జీవించాలని.. వైసీపీ నేతల ట్రాప్‌లో పడి జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికా రు. ఎన్నికల్లో తంగెడలో బాంబు దాడులకు పాల్పడి విధ్వంసాలతో దివ్యాంగుల దుకాణాలను ధ్వంసం చేసిన వ్యక్తిని వైసీపీ నేతలు కాపాడాలని పోలీస్ స్టేషన్‌కు గుంపులుగా వెళ్లడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. తప్పులు వాళ్లు చేసి, విచారణకు పోలీసులు పిలిస్తుంటే టీడీపీ వారిని రెచ్చగొట్టేలా మాట్లాడటం వైసీపీ నేతలకు సమంజసం కాదని హితవు పలికారు. రేగుల గడ్డలో కొన్ని రోజుల క్రితం వైసీపీకి చెందిన వ్యక్తి పాండు రంగారావు అనే కానిస్టేబుల్ చొక్కా పట్టుకున్నాడని, కూటమి ప్రభుత్వంలో కూడా విధ్వంసాలకు పాల్పడితే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని యరపతినేని మండిపడ్డారు. ఏమైనా చట్టప్రకారమే చర్యలు ఉంటాయే తప్పా టీడీపీ శ్రేణులు ప్రతి దాడులకు దిగబోరని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త చిన్న సుబ్బారావు, పాండురంగ శ్రీను, డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనగిరి శ్రీను, పిల్లి చెన్నారావు, కటకం అంకారావు, ముప్పాళ్ల సాంబయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

● 2,277 మంది అభ్యర్థుల గైర్హాజరు



పరీక్షా కేంద్రం వద్ద సమీక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. కేంద్రాల వద్ద ఎస్పీ సతీష్ కుమార్ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 పరీక్ష కేంద్రాల్లో 10,511 మంది అభ్యర్థులకు గాను 8,234 మంది హాజరయ్యారు. 2,277 మంది గైర్హాజరయ్యారు. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

రౌడీషీటర్ల ఆగడాలు అరికట్టాల్సిందే..

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

తెనాలి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ల ఆగడాలు అరికట్టేందుకు పోలీసులు తీసుకున్న చర్యలు సరైనవేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. కానీ, రౌడీషీటర్లకు కుల సంఘాలు వత్తాసు పలికితే వారి దౌర్జన్యాలకు అడ్డు ఆపు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెనాలిలో విలేకర్లతో ఆదివారం ఆయన మాట్లాడారు. విచారణ కోసం తీసుకెళ్లేందుకు వచ్చిన కానిస్టేబుల్‌పై రౌడీషీటర్లు దాడి చేయడం దుర్మార్గమన్నారు. అనాథ, ఎస్సీ మహిళను కానిస్టేబుల్ చిరంజీవి వివాహం చేసుకున్నా రని, వారికి జరిగిన అన్యాయాన్ని కూడా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి మత్తులో చిరంజీవిని చంపి ఉంటే.. ఆ కుటుంబానికి ఏం సమాధానం చెప్పేవారని ప్రశ్నించారు. హంతకులకు, రౌడీలకు మద్దతు ఇస్తే కుల సంఘాల ఐక్యత దెబ్బతింటుందని హితవు పలికారు. నిజంగా దళితులకు అన్యాయం జరుగుతుంటే తాము కూడా ముందుంటామన్నారు. రాజకీయ ముసుగులో దళిత, కుల సంఘాలు.. రౌడీషీటర్లను వెనకేసుకురావడం సరికాదన్నారు.

క్రీడల్లో గురువుల పాత్ర కీలకం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి
● ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న జస్టిస్ చీమలపాటి రవి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ

గుంటూరు(తూర్పు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల ప్రావీణ్యం వెలికితీసేందుకు గురువుల పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. రెండు రోజులుగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఎడ్ల రాజ్యలక్ష్మి మెమోరియల్ ఫస్ట్ ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్ర మంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవతేజతో పాటు న్యాయమూర్తి పాల్గొని, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిభతో పాటు క్రమశిక్షణ అవసరమని క్రీడాకారులకు సూచించారు. అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ తనిఖీ అధికారి వర్మను ఘనంగా సత్కరించారు. తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరు జిల్లా విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో హెచ్ ఫౌండేషన్ విజయం సాధించింది. విజేతకు జస్టిస్ చీమలపాటి రవి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ట్రోఫీ అందజేశారు. టీడీపీ నాయ కులు దామచర్ల శ్రీనివాస్, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, మేక రాహుల్ చౌదరి, ఎడ్ల రత్న దివ్యాన్ష్ హెచ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏఎస్ఐ అనంతలక్ష్మి మృతి



మట్టి ఖర్చులకు నగదు అందిస్తున్న సీఐ కృష్ణయ్య

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ ఐ అనంతలక్ష్మి క్యాన్సర్‌తో ఆదివారం మృతి చెందారు. గుంటూరులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ ఆమె చికిత్స పొందుతున్నారు. ఆమె మరణం పట్ల జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, స్టేషన్ సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు అంత్యక్రియలకు జిల్లా పోలీస్ విభాగం తరఫున రూ.లక్ష ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐలు కృష్ణయ్య, నారాయణ, జిల్లా ఇన్‌చార్జి వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, పోలీస్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. శాఖపరమైన అధికార లాంఛ నాలతో అనంతలక్ష్మి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతలక్ష్మి కానిస్టేబుల్‌గా 1992లో చేరి గుంటూరులోని లాలాపేట, పట్టాభిపురం, తెనాలి, పొన్నూరు, కొత్తపేట, పిసిఆర్ ఎస్సీ, ఎస్టీ సెల్‌లో విధులు నిర్వహించారు. ఏఎస్సై ఉద్యోగోన్నతి పొందారు.

సీతారామయ్య హైస్కూల్‌ను సందర్శించిన జస్టిస్ చీమలపాటి రవి



జస్టిస్ చీమలపాటి రవిని సత్కరిస్తున్న యలమంచిలి శివాజీ, విష్ణు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌ను హైకోర్టు జడ్జి జస్టిస్ రవి చీమలపాటి సందర్శించారు. ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు గుంటూరు వచ్చిన ఆయన హైస్కూల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జస్టిస్ రవి మాట్లాడుతూ సీతారామయ్య ఆశయాలకు అనుగుణంగా నేటి సమాజానికి మంచి విలువలు అందేలా విద్యాబోధనతో పాఠశాలను నడపడం అభినందనీయమన్నారు. పాఠశాల పాలక వర్గ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సెక్రటరీఅండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, దేవినేని శేషగిరిరావు, దామచర్ల శ్రీనివాసరావు, బాస్కెట్‌బాల్ అకాడమీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుంటుపల్లి హరగోపాల్ పాల్గొన్నారు.

నిర్బంధ బదిలీ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

● ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసఫ్



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌టీయూ నాయకులు

గుంటూరు (విద్య) జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఎస్ఏ కేడర్‌లో వివిధ సబ్జెక్టుల నుంచి క్యాడర్ జూనియర్లుగా గుర్తించి వారిని పీఎస్ హెచ్‌ఎం కోసం తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేయమని ఆదేశాలు జారీ చేయడం శోచనీయమని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుడు లింగేశ్వరరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు డీ పెదబాబు మాట్లాడుతూ సీనియార్టీ జాబితాలో సమానమైన పాయింట్లు వచ్చినప్పుడు క్యాడర్ సీనియార్టీలో మెరిట్ ప్రకారం జాబితా రూపొందించాల్సి ఉందన్నారు. కానీ, క్యాడర్ సీనియార్టీ మెరిట్ ప్రకారం కాకుండా... పుట్టిన తేదీలను బట్టి జాబితా తయారు చేయడం సరి కాదని పేర్కొన్నారు. జీవోకి విరుద్ధంగా ఉన్న బదిలీలను వెంటనే సరిచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుబ్బారెడ్డి, ఎస్‌టీయూ నాయకులు శ్యామ్, దిబ్బయ్య, బాజీ, వెంకట్రావు పాల్గొన్నారు.

పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ఎస్‌జీటీలకు ఇవ్వాలి



డీఈవో సీవీ రేణుకకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య) జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో 219 మంది జూనియర్ స్కూల్ అసిస్టెంట్ టీచర్లను నిర్బంధంగా పీఎస్ హెచ్‌ఎంలుగా బదిలీ చేయడం విరమించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం డీఈఓ సీవీ రేణుకకు వినతిపత్రం అందజేశారు. పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. ఎస్ఏలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సహాధ్యక్షుడు గుంటూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఆదినారాయణ, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

నాదెండ్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు.. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలోని తిరుమల నూలు మిల్లు లో ప్రియతమ్ మాలిక్(24), సోదరుడు శ్రీతమ్ మాలిక్‌తో కలసి పనిచేస్తూ..అక్కడే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి మిత్రుడు లిట్టుతో కలసి ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేటకు వెళ్లి వస్తున్నాడు. ప్రసన్న వంశీ నూలు మిల్లు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రియతమ్ మాలిక్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ లిట్టూను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ సొత్తు కొన్న బంగారు వ్యాపారి..

పోలీసుల విచారణ

నరసరావుపేట రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ బంగారం వ్యాపారి చోరీకి గురైన అరకేజీ బంగారం, ఏడు కేజీల వెండి కొనడంతో అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం వెలుగులోకి వచ్చింది. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాష్ నగర్‌కు చెందిన ఓ మహిళకు తాను చోరీ చేసిన ఏడు కేజీల వెండి, అరకేజీ బంగారం విక్రయించినట్లు అతను పోలీసులకు చెప్పాడు. దీంతో సదరు మహిళను విచారించగా.. ఈ మొత్తం సొత్తును ఓ ప్రముఖ బంగారు వ్యాపారికి విక్రయించినట్లు ఒప్పుకుంది. దీంతో సదరు వ్యాపారిని నరసరావుపేట పోలీసులు శని, ఆదివారాలు విచారణకు పిలిచినట్లు సమాచారం. పల్నాడు జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి సదరు వ్యాపారికి అండగా పోలీసుల వద్దకు వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై నరసరావుపేట డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావును వివరణ కోరగా.. ఘటన వాస్తవమేనని, వ్యాపారిని విచారిస్తున్నామని సమాధా నం ఇచ్చారు. పూర్తి వివరాలు సోమవారం వెల్లడిస్తామన్నారు.

అడవి పంది మాంసం విక్రేతల అరెస్టు

యడ్లపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలస గ్రామ పరిధిలో శనివారం రాత్రి అడవి పంది మాంసం విక్రేతలను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి ఉన్న మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిని జిల్లా అటవీశాఖాధికారులకు అప్పగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

గుంటూరులోనే పంచకర్మ ఆయుర్వేద వైద్యసేవలు

● కేరళ ఆయుర్వేద నిపుణులు కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని, కేరళ వారి అనుబంధంతో అన్ని సదుపాయాలతో వంద పడకల సామర్థ్యంతో గుంటూరులోనే ఆయుర్వేదిక్ ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు, డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం వెనిగండ్ల బోసుబొమ్మ సెంటర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. వెనిగండ్ల గ్రామ సర్పంచ్ వేల్పుల శ్రావణి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పురాతన మైదని, అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఈ వైద్య విధానంలో చక్కటి పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ మోనిక, డాక్టర్ రాహుల్ చంద్ర, రోగుల బీపీ, షుగర్ పరీక్షలతో పాటు నాడీ పరీక్షలు జరిపారు. శిబిరంలో 150 మంది రోగులు వైద్యసేవలు పొందగా, వీరికి రూ.లక్ష విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండమడుగుల శ్రీనివాస్‌రెడ్డి, మున్నంగి సాంబిరెడ్డి, గుదిబండి సాంబిరెడ్డి, కొండమడుగుల సుబ్బారెడ్డి, హాస్పిటల్ మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.


నాడీ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

లక్ష్యసాధన కోసం అకుంఠిత దీక్ష అవసరం

● జడ్పీ సీఈవో జ్యోతిబసు


మాట్లాడుతున్న జ్యోతిబసు

గుంటూరు (విద్య) జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తన స్వీయ అంచనా ద్వారా ఆసక్తి గల సబ్జెక్టులను ఎంచుకుంటే స్థిరమైన లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా పరిషత్ సీఈవో బీ.జ్యోతిబసు అన్నారు. ఆదివారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని వివా కన్వెన్షన్‌లో శ్రీకృష్ణ యాదవ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన యాదవ విద్యార్థుల కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి జ్యోతిబసు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు ఇంటర్మీడియట్‌లోనే కేవలం మ్యాథ్స్, సైన్స్ కోర్సులకే కాకుండా ఆర్ట్స్ కోర్సులలో కూడా ప్రవేశించి కఠిన శ్రమ చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ కమిషన్లతోపాటు రైల్వే, బ్యాంకు ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని చెప్పారు. శ్రీకృష్ణ యాదవ సేవాసమితి ఈ ఏడాది కూడా పదో తరగతిలో 500కు పైబడి మార్కులు సాధించినటువంటి విద్యార్థులకు రూ.3 వేల చొప్పున దాదాపు 500 మందికి స్కాలర్‌షిప్‌ను అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు, బీపీ మండల సేన రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నవ్యాంధ్ర రాజధానిగా రూపుదిద్దుకుంటున్న గుంటూరు-విజయవాడ నగరాల మధ్య యాదవ విద్యార్థులకు సరైన వసతులతో కూడిన వసతి సముదాయం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ శ్యాంప్రసాద్, దాసరి శివకుమార్, రాచమంటి శివాజీ, డాక్టర్ తాడిబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ నల్లమేకల శివరామకృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ ఆలా నేతృత్వంలో బీపీ మండల్ ట్రస్ట్ ఆవిష్కరణ

గుంటూరు (విద్య) జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి సరైన వేదిక ఉండాలనే తలంపుతో శాశ్వత భవన సముదాయానికి తన వంతు సాయంగా రాజధాని ప్రాంతంలో 40సెంట్ల ఖరీదైన భూమిని డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు బీపీ మండల్ ట్రస్ట్‌కు విరాళంగా అందజేశా రు. ఆదివారం ఏటుకూరు రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి నేతృత్వంలో డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి శ్యాంప్రసాద్, ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మరికొందరు యాదవ ప్రముఖుల నేతృత్వంలో ట్రస్టును ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులతో పాటు అవసరమైన ప్రతి బీసీ కుటుంబాన్ని ఆదు కునేలాగా అనేక కార్యక్రమాలు ముందు చేపట్టడానికి ట్రస్టు నిర్వాహకులు కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తున్నట్లు డాక్టర్ ఆలా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంప్లాయి మెంట్ అధికారిని రజిని ప్రియ, కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ ఆలా అనురాధ, కే నాగభూషణం, మధు, దాసరి శివకుమార్, ఏపీటీడీసీ చైర్మన్ ఎం బాలాజీ, డాక్టర్ శ్యాంప్ర సాద్, పోతురాజు హరిబాబు పాల్గొన్నారు.


ట్రస్టు లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తదితరులు

పట్టణ ప్రజలపై పన్నుల భారం ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలపై పన్నుల భారం ఉపసంహరించుకోవాలని పౌరసంఘాలు డిమాండ్ చేశాయి. ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఫాక్వా) ఆధ్వర్యంలో పట్టణాల్లో పన్నుల వసూళ్లకు సంబంధించిన విడుదల చేసిన ఉత్త ర్వులపై స్థానిక బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఫాక్వా కన్వీనర్ ఎల్ఎస్ భారవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత ప్రభుత్వం అద్దె విలువ ఆధారిత పన్ను విధానం రద్దు చేసి, ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం తీసుకొచ్చిందన్నారు. అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ తాము అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని పునః సమీక్షిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఉంచిందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పునఃసమీక్షించకపోగా ఇప్పుడు వసూలు చేస్తున్న పన్నులపై 20 శాతం అదనంగా పన్నులు వసూలు చేయాలని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. దీని ద్వారా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలపై రూ.32 కోట్ల అదనపు పన్ను భారం పడనుందని చెప్పారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు కె.నళినీకాంత్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గురు రౌడీషీటర్లపై పీడీ యాక్ట్

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : వరుస నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముగ్గురు రౌడీషీటర్‌లపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. మంగళగిరి టౌన్‌కు చెందిన బుల్లా మనోజ్ (26), వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముట్లూరు గ్రామానికి చెందిన అల్లం సాయి సాంబశివరావు అలియాస్ సాయి (23), చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజండ్లకు చెందిన పోతినేని గోపీ (35) తదితరులపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఈ ముగ్గురిపై రౌడీషీట్‌లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల జిల్లా పోలీస్ అధికారులు ఆయా రౌడీషీటర్‌లపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు పంపగా వాటిని ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆమోదించారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

గుంటూరు(తూర్పు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నూరు రోడ్డు, ఎమ్ కన్వెన్షన్‌లో బ్రైట్ హారిజన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఎమ్‌కేఎస్ మొహియిద్దీన్ హాజరై కుట్టుమిషన్లను అందజేసి మాట్లాడారు. నగరంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాదాపు 400 పైగా మహిళలకు శిక్షణ అందించామని వివరించారు. నీట్ కోచింగ్, ఎస్ఐ కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ చాంద్ బాషా, డాక్టర్ ఖలీల్ ఇబ్రహీం, డాక్టర్ సలీం పాషా, అన్సర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి


రేషన్ సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

వీలున్నప్పుడు సరుకులు తెచ్చుకునే సదవకాశం

● ఇన్‌చార్జి కలెక్టర్ ఏ భార్గవతేజ

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చౌక ధర దుకాణాల్లో ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులు వీలున్నప్పుడు నిత్యావసర సరుకులు తెచ్చుకునే అవకాశం కల్పించామని ఇన్‌చార్జి కలెక్టర్ ఏ భార్గవతేజ తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో వసంతరాయపురంలోని చౌక ధరల దుకాణం నెం.61ను ఆయన పునఃప్రారంభించి, కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణాల నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ-పోస్ మిషన్ ద్వారా రైస్ కార్డుదారుల అథెంటిఫికేషన్ తీసుకొని బ్లూటూత్ అనుసంధానమైన వేయింగ్‌స్కేల్ ద్వారా ఖచ్చితమైన తూకంతో సరు కులను పంపిణీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహసీల్దార్ మహబూబ్ సుభాని, సీఎస్‌డీటీ భాస్కర్, చౌక ధరల దుకాణం నిర్వహకులు చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రజలకు, తల్లికి, చెల్లికి జగన్ వెన్నుపోటు : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అధికారమిచ్చిన ప్రజలకు, ఇంట్లో తల్లికి చెల్లికి వెన్నుపోటు, బాబాయ్ వివేకాపై గొడ్డలిపోటు వేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ వైఖరిపై ఆమె ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన ద్రోహాలను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని, నవరత్నాల పేరుతో నవమోసాలు చేశారని విద్యార్థి, యువత, వృద్ధుల వరకు అన్ని వర్గాలను మోసం చేసి, నేడు వెన్నుపోటు అంటూ కార్యక్రమాల పేరుతో తమ ఉనికి కోసం వైసీపీ నేతలు ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవి మండిపడ్డారు. ఎన్డీయే కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక ఈ డ్రామాలకి తెరలేపారన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం

ప్రభుత్వం చేపట్టిన రేషన్ షాపుల వద్దే రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, తహసీల్దార్‌లు ప్రారంభించారు. లబ్ధిదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు వంటి సరుకులను అందించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఎండీయూ వాహనాల పేరుతో కోట్లాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసి, ప్రభుత్వం మీద భారం మోపటమే కాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమ ర్శించారు. రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలను తాను సహించనని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాల మ్యానీ, అడక పద్మావతి, శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, తుమ్మల నాగేశ్వరరావు, షాహిద్‌బాబు, షేక్ బాబు, బుడే, ప్రమీల, కామినేనీ చంద్ర, కోరంగి శ్రీను, పేరం అనిత పాల్గొన్నారు.

కార్డుదారులకు గౌరవంగా సరుకులందిస్తాం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కార్డుదారులకు గతంలో మాదిరిగా గౌరవప్రదంగా రేషన్ దుకాణాల వద్దే నిత్యావసర సరుకులు అందించేందుకు శ్రీకారం చుట్టామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని 9, 10, 12, 56 డివిజన్లలోని రేషన్ దుకాణాల్లో ఆదివారం ఆయన స్థానిక నేతలతో కలిసి సరుకుల పంపిణీని ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ 65 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగు లకు ఇంటి వద్దకే తెచ్చి రేషన్ సరుకులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, అల్లం బాజీ, గాలి సతీష్, అబ్దుల్ సలీం, వాణి, హఫీజ్, సాయి, వెంకట్, ఐలా శ్రీనివాస్, మాదాసు శేఖర్, వేములకొండ శ్రీనివాస్, ఏడుకొండలు, కొండేపి శేఖర్, బలరాం, నాగేశ్వరరావు, నవీన్, బద్రి, అర్వపల్లి శీను పాల్గొన్నారు.

ఆరో డివిజన్లో రేషన్ పంపిణీ చేసిన కార్పొరేటర్ సమత

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు గుంటూ రు ఆరో డివిజన్లోని కొత్తపేట, రైలుపేట, రాజాగారితోట, గుంటూరువారితోట సహా పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పోతురాజు సమత రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమానికి ఆరో క్లస్టర్ పోతురాజు చంద్రశేఖర్, బాజీ మాస్టర్, వెంకన్న, లోకేశ్, కృష్ణ మహల్ చిన్న సాయిరాం మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు

డిపోల ద్వారా రేషన్ పంపిణీ చేయడం హర్షణీయం

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదల బియ్యాన్ని దళారుల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తూ రేషన్ మాఫియా రూ.వేల కోట్లు దోచుకుం దని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి విమర్శించారు. శ్రీనివాసరావుతోటలో ఆదివారం పలు డిపోల్లో రేషన్ సరుకుల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. రేషన్ మాఫియాను కూకటి వేళ్లతో పెకలించేందుకు డిపోల దగ్గరే రేషన్ పునఃప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు హరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మెహబూబ్ బాషా, వడ్డే సుబ్బారావు, బాలాజీ, నండూరి స్వామి, కోలా ఆంజనేయులు, వెంకట రమణ, మల్లేశ్వరి, మాధవి పాల్గొన్నారు.

క్రీడలతో సుస్థిర భవిష్యత్తు

● రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వెంకటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రీడలతో సుస్థిర భవిష్యత్తు ఏర్పడుతుందని రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ఓపెన్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీతో క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. నసీర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడంతో సంతోషంగా ఉందన్నారు. రూ.100 కోట్ల నిధులతో బీఆర్ స్టేడియంను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కోచ్ అహ్మద్ మాట్లాడుతూ అండర్-16, బాల, బాలికల విభాగంలో జరిగిన పోటీల్లో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు. పోటీలకు సహకరించిన డాక్టర్ రామకృష్ణకు కృత జ్ఞతలు తెలిపారు. సింగిల్స్ విభాగంలో గోలి జోషిత, కొరిటపాటి విన్సెంట్, డబుల్స్‌లో కొరిటపాటి విన్సెంట్, జీ దిశాంత్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మీరావలి, శ్రీనివాసరావు, వాణి, రియాజ్, కోచ్‌లు, బీఆర్ స్టేడియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మోడల్ లాసెట్‌కు విశేష స్పందన

గుంటూరు(తూర్పు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్యామలనగర్, మాంటెస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత మోడల్ లాసెట్ పరీక్షకు విశేష స్పం దన లభించింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభ్యర్థులు పరీక్షకు హాజర య్యారు. కార్యక్రమానికి సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, అడిష నల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ, గుంటూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి గండికోట శేష గిరిరావు హాజరై మోడల్‌పేపర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 5న జరిగే లా పరీక్షకు ఈ మోడల్ పరీక్ష అభ్యర్థులకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో న్యాయ వాదులు జనార్దనరావు, చిలక డేవిడ్‌రాజ్, జీ కోటేశ్వరరావు, సత్యనారాయణ, బీసీ సంఘ నాయకులు రమణ, నరసింహారావు, జూపూడి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

కరువుభత్యం జీవో విడుదలపై మీన మేషాలెందుకు : వీరయ్య

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మీనమేషాలు లెక్కించకుండా ఉద్యోగులు, పెన్షన్‌దారులకు రావలసిన రెండు డీఏలలో ఒకటైనా మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రికి రాసిన ఒక లేఖలో పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య విజ్ఞప్తి చేశారు. నిత్యవసరాల ధరలు పెరగటంతో కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు, పింఛన్‌దారులకు కరువుభత్యం ప్రకటించి చాలా కాలమైందన్నారు. కేంద్ర ఉత్తర్వులు వెలువడిన వెంటనే రాష్ట్ర సర్కార్ కూడా స్పందించి కరువుభత్యంపై సత్వరమే సానుకూల నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కోరారు. హేతు బద్ధత లేకుండా రాష్ట్ర విభజన చేయటం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించిందని, అందువల్లే డీఏ ఇవ్వలేకపోతున్నామని చెప్పటం సహేతుకం కాదని, పరిగెడుతున్న పప్పుల ధరలను, పెంచిన పెట్రోలు ధరలను దృష్టిలో ఉంచుకొని ఒక డీఏను మంజూరు చేయటంతోపాటు మరో డీఏను ఎన్నికలప్పుడు మంజూరు చేయటం ద్వారా పెన్షనర్లు, ఉద్యోగుల ఓట్లను సంపూర్ణంగా పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. తద్వారా ఉద్యోగులు, పెన్షన్‌దారుల్లో ఉన్న ఆందోళన తొలిగిపోతుందని లేఖలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌బీ నగర్, షాప్ ఎంప్లాయిస్ కాలనీ, రజకుల కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పోలీస్ ప్లాట్స్, నందమూరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఆలీనగర్, అంకమ్మతల్లి గుడి, బావాజీమఠం, ముగ్దుమ్‌నగర్, పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8 నుం చి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే గడ్డిపాడు, గణేష్‌నగర్, ఏఎస్ కన్వెన్షన్, గాయత్రీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. పొత్తూరివారితోట, గుంటూరువారితోట, పొన్నూరు రోడ్డు, హుస్సేన్‌నగర్, చంద్ర బాబునాయుడు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డిప్యూటీ ఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బందికి ఘన సత్కారం

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు సిబ్బంది ఘనంగా సత్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా సిబ్బందిని, కుటుంబసభ్యులను ఘనంగా సత్కరించారు. సుదీర్ఘ కాలం పోలీస్‌శాఖలో పనిచేసి మే 31న ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐలు రంగారావు, పీ నాగేశ్వరరావు, ఆర్ఎస్ఐ బీ.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ ఎంవీ కృష్ణారావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ షేక్ మహమ్మద్ షరీఫ్, కానిస్టేబుల్ జి.నాగేశ్వరరావులను సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు రమణమూర్తి (అడ్మిన్), ఏ.హను మంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్, ఆర్ఐలు శివరామకృష్ణ, జిల్లా పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.సాంబశివరావు, సెక్రటరీ లక్ష్మణ్, కోశాధికారి హుస్సేన్ పాల్గొన్నారు.

అహల్యాబాయి జీవితం.. ఆదర్శనీయం

గుంటూరు(తూర్పు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో అనేక ఆలయాలను నిర్మించడంతో పాటు మహిళలు, రైతుల కోసం అనేక ఉద్యమాలు చేసిన అహల్యాబాయి హోల్కర్ జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక మాస్టర్ మైండ్స్ కళాశాలలో ఆదివారం అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ఆమె పాలనలో దేశ సాంస్కృతిక వైభవం వెలుగొందిందని, 152 ఆలయాలు పునర్నిర్మించారన్నారు. కార్యక్రమంలో తాడు వాయి రామకృష్ణ, పాలపాటి రవికు మార్, కుమార్‌గౌడ్, వెలగేటి గంగా ధర్, రేణుకదేవి, గంగ భవానీ, మాధవ రెడ్డి, తిరుపతి రాయుడు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్‌లు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లపై ఫిర్యాదులు వస్తే సహించేదిలేదన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నగరంలోని కెవీపీ కాలనీకి చెందిన విప్పర్ల బుచ్చిబాబు (32) గత నెల 28న అర్ధరాత్రి సమయంలో ప్రత్తిపాడు నుంచి ద్విచక్ర వాహనంపై గుంటూరు వస్తూ ఏటుకూరు బైపాస్ రోడ్డు సెంటర్ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య వేళంగిణి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పెయింట్ పని చేస్తుంటాడని పోలీసులు తెలిపారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పట్టపగలే చోరీ జరిగింది. కాలనీకి చెందిన అట్లూరి వెంకట రత్నం, సాంబిరెడ్డి దంపతులు గత నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి తాళం వేసి బ్యాంక్‌కు వెళ్లారు. తిరిగి 4.30 గంటలకు ఇంటికి రాగా మెయిన్ డోర్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ఇంటిలో ఉన్న 11 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ వెన్నుపోటు దినాన్ని నిర్వహించడం హాస్యాస్పదం

● ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్


డేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్ రెడ్డి వెన్నుపోటు దినాన్ని నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రి యల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ఎద్దేవా చేశారు. టీడీపీ నగర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గత వైసీపీ అరా చక పాలనను ప్రజలు సరైన తీర్పు ఇచ్చి తరిమికొట్టిన రోజు జూన్ 4 అని, అలాంటి రోజున వెన్నుపోటు అంటూ నిరసనలు చేయడం ప్రజల్ని అవమానించినట్లే అని డేగల విమర్శించారు. ప్రజాతీర్పును వ్యతిరేకిస్తూ ప్రజల్ని వెన్నుపోటుదారులుగా చెబుతూ నిర్వహిస్తున్న నిరసనలకు ప్రజలు ఎలా వస్తారని ప్రశ్నించారు. గతంలో రేషన్ తీసుకోవాలంటే ప్రజలు పనులు మానుకో వాల్సి వచ్చేదన్నారు. చౌక బియ్యం అక్రమాలు చేసి రూ.వేల కోట్లు దారి మళ్లించారని ఆరో పించారు. రేషన్ దుకాణాల వద్దే పంపిణీ చేయడం వల్ల అక్రమాలు తగ్గుతాయని పేర్కొన్నారు.



తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకుడు తాళ్ల వెంకటేశ్ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చంద్రబాబుకి వివరించారు. అనంతరం సీఎం ఆయనను అభి నందించారు.
- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రోగులకు మందులు అందజేస్తున్న రాజకుమారి, ఉమాశంకర్

గుంటూరు మెడికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముంగి టకే వచ్చి చక్కటి వైద్య సేవలు అందించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్విని యోగించు కోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఉద్బోధించారు. ఆదివారం రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ గర్భిణులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, గర్భిణులు చేయాల్సిన వ్యాయామాలను ఆమె వివరించారు. అనంతరం వైద్యశిబిరంలో డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి, డాక్టర్ కరీమా, డాక్టర్ కే.లిఖిత తదితరులు 250 మంది రోగులను పరీక్షించి వైద్యసలహాలు అందజేశారు. అందరికీ ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్ర మంలో జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ సుధాకర్, ఎం శ్రీనివాస్, వెంకట్రావు, శివ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో పోరాడి.. కిరీటాన్ని గెలుచుకుని..



చిన్నప్పుడు ఏదైనా చిన్న దెబ్బతగిలితేనే ఎంతో హైరానా పడిపోతారు అందరూ. కానీ క్యాన్సర్ అంటే ఏంటో సరిగా తెలియని వయసులోనే దాని బారిన పడి పోరాడి గెలిచి నేడు ప్రపంచ సుందరిగా నిలిచారు ఓపల్ సుచాత షుంగ్‌సిరి. క్యాన్సర్‌తో తనలా ఎవరు ఇబ్బంది పడకూడదని 'ఓపల్ ఫర్ హర్' అనే ప్రాజెక్ట్‌ను ఆమె ప్రారంభించారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు ఈ థాయ్‌లాండ్ భామ. ఈ ప్రాజెక్ట్ గురించి పలు సందర్భాల్లో ఆమె పంచుకున్న సంగతులు..

నాకు పదహారవ ఏటనే రొమ్ములో కణితి ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలిసినప్పుడు ఎంతో బాధ పడ్డా, భయపడ్డా. నాకిక భవిష్యతే లేదని నిరాశ చెందా. కానీ భయంలో నుంచి నాలో ధైర్యం పుట్టుకొచ్చింది. దానితో క్యాన్సర్‌ను జయించా. అయితే ఆ పరిస్థితుల్లో నా కుటుంబం, చుట్టూ ఉన్న సమాజం నాకెంతో అండగా నిలబడింది. మరి నాలా ఇలాంటి అండ లేని వారి పరిస్థితి ఏంటనే ఆలోచనే 'ఓపల్ ఫర్ హర్' స్థాపనకు పునాది అయింది.

ఆరోగ్యమే ప్రధానం

క్యాన్సర్ నన్ను, నా ఆలోచనలను ఎంతో మార్చింది. మనిషి జీవితంలో ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదని నా అభిప్రాయం. ఎందుకంటే ఆరోగ్యం ఉంటేనే తన లక్ష్యాలు చేరుకోగలరు, ఏదైనా సాధించగలరు.

నాలా అండ లేని వారి కోసం

క్యాన్సర్ సంక్లిష్ట సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను తెలిసిన వారితో పంచుకున్నాను. నేను చెప్పిన ఆ అనుభవాలు తమకు స్ఫూర్తినిచ్చిందని, తామూ క్యాన్సర్‌ను జయించామని కొందరు చెప్పారు. అప్పుడే క్యాన్సర్ రోగులకు అవగాహనతో పాటు మనోధైర్యాన్ని అందించాలని అర్థమయింది. నాలానే క్యాన్సర్‌ను జయించిన వారి జీవిత కథలు చెప్పి మరికొందరికి జీవితం మీద ఆశ కలిగించాలని నిర్ణయించుకున్నా. ఆలోచన అయితే ఉంది కానీ దానిని సరైన వేదిక లేదు. 'ఓపల్ ఫర్ హర్' స్థాపనతో ఆ వేదిక దొరికింది.


నా సంపాదన కూడా..

'ఓపల్ ఫర్ హర్' ప్రాజెక్ట్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన, దానిని ముందుగా గుర్తించాల్సిన ఆవశ్యకత తెలియజేశా. క్యాన్సర్‌ను జయించిన వారితో పాడ్‌కాస్టలు, వైద్యులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంతో మందిలో ఆత్మస్థైర్యం నింపడం ప్రారంభించా. అయితే ఆ తరువాత నాకో భయంకరమైన చేదు నిజం తెలిసింది. అదేంటంటే చాలా మందికి ఆస్పత్రులకు వెళ్లేందుకు డబ్బులు లేవని. దాంతో అలాంటి వారి కోసం నిధుల సేకరించడం మొదలుపెట్టా. నా సంపాదన కూడా నిరుపేద మహిళల చికిత్స కోసం విరాళంగా ఇచ్చేశా. ఆపై ఆస్పత్రులు, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, లాభాపేక్ష లేని సంస్థలు ఆర్గనైజేషన్లు, థాయ్‌లాండ్ ప్రజారోగ్య శాఖతో కలిసి పనిచేయడం ప్రారంభించా. ఇలా ఇప్పటి వరకూ ఎంతోమంది థాయ్ మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించా. ప్రస్తుతం ఈ మిస్‌వరల్డ్ పోటీల ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన గురించి 'ఓపల్ ఫర్ హర్' స్వరాన్ని ప్రపంచమంతా వినిపించగలిగా.

ప్రపంచమంతా విస్తరించాలి..

ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. థాయ్‌లాండ్‌లోనే ఏటా సుమారు 2 వేల మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. వీటిలో 5 శాతం కంటే తక్కువ కేసులు మాత్రమే తొలి దశలో బయటపడుతుండడం బాధాకరం. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సులభంగా దానిని జయించవచ్చు. అందుకే 'ఓపల్ ఫర్ హర్' కేవలం థాయ్‌లాండ్‌కు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని అనుకుంటున్నా. ప్రపంచ నలుమూలల ఉన్న రొమ్ము క్యాన్సర్ బాధితులకు జీవితంపై ఆశలు రేకెత్తించాలని భావిస్తున్నా.

ఆంధ్రజ్యోతి
8
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 2 జూన్ 2025



క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు!

మన వాళ్లకు క్రికెట్ అంటే పిచ్చి. గ్రౌండ్‌లో అయినా మొబైల్‌లో అయినా.. "ఈ మధ్యకాలంలో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా క్రికెట్ గేమ్ ఆడటం బాగా పెరిగింది.." అంటారు 'రియల్ క్రికెట్' అనే మొబైల్ గేమ్‌ను అభివృద్ధి చేసిన టీమ్‌లో ఒకరైన అంజూ మన్‌కర్. ఆమెను నవ్య పలకరించినప్పుడు ఈ గేమ్‌కు సంబంధించిన అనేక విశేషాలు వెల్లడించారు.

"క్రికెట్ చాలా మందికి జీవితాల్లో ఒక భాగం. వీరిలో ఎక్కువ మంది గ్రౌండ్స్‌కు వెళ్లి ఆడలేరు. దీనితో మానిటర్స్ ముందు.. మొబైల్స్‌లోను ఆడుతూ ఉంటారు. గతంలో ఈ గేమ్స్‌కు కొన్ని పరిమితులు ఉండేవి. మాకు 2013లో ఒక మంచి క్వాలిటీ ఉన్న క్రికెట్ గేమ్‌ను తయారుచేయాలనే ఆలోచన కలిగింది. ఫుట్‌బాల్‌లో మనకు మంచి మంచి మొబైల్ గేమ్స్ ఉన్నాయి. అలాంటిది మనం కూడా తయారుచేస్తే- ప్రపంచమంతా దానిని ఆడతారు అనే ఆలోచనతో రియల్ క్రికెట్‌ను అభివృద్ధి చేయటం ప్రారంభించాం. అప్పుడు మా టీమ్ కేవలం ఆరుగురు మాత్రమే! మేము దీనిని అభివృద్ధి చేసిన తర్వాత 2020లో జాక్‌సన్ డైస్ అనే కంపెనీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత ఈ మధ్యకాలంలోనే క్రాఫ్టన్ అనే కంపెనీ కూడా భాగస్వామిగా చేరింది. క్రాఫ్టన్ మాతో చేరటం వల్ల అంతర్జాతీయంగా ఈ గేమ్‌కు మరింత ఆదరణ లభిస్తుందని భావిస్తున్నా. మొదట్లో ఈ గేమ్‌ను తయారుచేసినప్పుడు కొన్ని లక్షల మంది మాత్రమే డౌన్‌లోడ్ చేసేకొనేవారు. ఇప్పుడు ఈ సంఖ్య 50 కోట్లకు చేరింది.

చాలా కష్టం..

గేమింగ్ అంటే చాలా మంది సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తే చాలు అనుకుంటారు. గేమింగ్‌లో సాఫ్ట్‌వేర్ ఎంత ప్రధానమో.. కళాత్మకంగా ఉండటం కూడా అంతే ప్రధానం. క్రికెట్‌లాంటి గేమ్‌ను అభివద్ధి చేయటం ఒక కోణం నుంచి చూస్తే పెద్ద సవాల్ అనే చెప్పాలి. మరో కోణం నుంచి చూస్తే కొంత సులువు అనే చెప్పాలి. ఈ కారణాలు నేను వివరిస్తాను. షూటింగ్‌లాంటి గేమ్‌ను తయారుచేస్తున్నామనుకుందాం. చాలా మందికి షూటింగ్‌లో రూల్స్ తెలియవు. అందువల్ల వారికి ఆ రూల్స్ సులభంగా అర్థమయ్యేలా గేమ్‌ను తయారుచేయాలి. ఇది ఒక పెద్ద సవాల్. క్రికెట్ లాంటి గేమ్‌లో రూల్స్ అందరికీ తెలుసు. అందువల్ల ఈ రూల్స్‌ను ఆడేవారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఉండదు. అయితే ఈ గేమ్ వాస్తవిక ప్రపంచానికి దగ్గరగా ఉండాలి. భావోద్వేగాలు ఉండాలి. ఆడేవ్యక్తికి నిజంగా గ్రౌండ్‌లో ఉన్నంత భావన కలగాలి. ప్రతి రోజు గ్రౌండ్‌లో ఆడినప్పుడు ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో.. వాటన్నింటినీ బేరీజు వేసుకుంటూ ఈ గేమ్‌ను అభివృద్ధి చేయాలి. ఒక రోజులో రెండు గంటలు ఈ గేమ్ ఆడినా బోరు కొట్టకూడదు. లేకపోతే గేమర్స్ దీనిని ఆదరించరు. అందువల్ల మేము ఈ గేమ్‌ను తయారుచేసేటప్పుడు చిన్న చిన్న విషయాలపై కూడా దృష్టి పెట్టాం. లేకపోతే గేమర్స్ దీనిని వదిలేసి ఇతర గేమ్స్‌లోకి వెళ్లిపోతారు.

గేమింగ్‌లో తక్కువే..

గేమింగ్ అనేది ఒక ప్రత్యేకమైన క్రీడ. ఈ గేమ్స్‌ను తయారుచేసే కంపెనీలు కూడా ప్రత్యేకమైనవే! అయితే మహిళా గేమింగ్ డెవలపర్స్ ప్రస్తుతం తక్కువనే చెప్పాలి. ఒక కంపెనీలో 10 మంది మగ డెవలపర్స్ ఉంటే.. అమ్మాయిలు ఇద్దరు మాత్రమే ఉంటారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ఒకటి- గేమింగ్‌ను ఒక సీరియస్ ఐటీ పరిశ్రమగా భావించకపోవటం. ప్రతి ఏడాది కొన్ని వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న పరిశ్రమ ఇది. కానీ దీనిని ఐటీలో భాగంగా భావించరు. ఈ ధోరణిలో మార్పు వస్తే ఎక్కువ మంది అమ్మాయిలు గేమింగ్ అభివృద్ధిలో పాలుపంచుకుంటారు. ఇక చిన్నప్పటి నుంచి అమ్మాయిలు కళల వైపు వెళ్లాలని.. అబ్బాయిలు ప్లే స్టేషన్స్ వంటివి ఆడాలనే భావన తల్లితండ్రుల్లో ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో ఈ విభజన చెరిగిపోతోంది. అమ్మాయిలు కూడా ప్లేస్టేషన్ల వంటివి ఆడుతున్నారు. ఇంకో పదేళ్లలో ఈ విభజన పూర్తిగా చెరిగిపోతుంది. ఆ సమయానికి గేమింగ్‌కు ఐటీ పరిశ్రమలో ఒక సముచిత స్థానం లభిస్తుంది. అప్పుడు క్రికెట్ గేమ్‌లో అమ్మాయిలకే భవిష్యత్తు ఉందని చెప్పాలి.

అమ్మాయిలు కూడా..

ఒకప్పుడు క్రికెట్ కేవలం పురుషుల ఆట మాత్రమే. భారత ఉపఖండంలో ఇప్పటికీ ఎక్కువ మంది అబ్బాయిలే ఈ గేమ్‌ను ఆడతారు. అయితే ఈ మధ్యకాలంలో ఈ గేమ్‌ను ఆడుతున్న అమ్మాయిల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఉదాహరణకు ప్రతి రోజూ మా గేమ్‌ను 20 లక్షల మంది ఆన్‌లైన్‌లో ఆడుతూ ఉంటారు. వీరిలో 11 శాతం అమ్మాయిలు ఉంటారు. మా దగ్గర ఉన్న గణాంకాల ఆధారంగా చూస్తే వీరి సంఖ్య పెరుగుతూ వస్తోంది. భవిష్యత్‌లో మరింతగా పెరుగుతుంది. మేము అమ్మాయిల టీమ్‌లతో ప్రత్యేకమైన గేమ్‌ను తయారుచేయాలనుకుంటున్నాం. ఇక ఏ ప్రాంతంలో ఎక్కువగా క్రికెట్ గేమ్‌ను ఆడతారు అనే విషయాన్ని గమనిస్తే- మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు.. హైదరాబాద్ అని చెప్పవచ్చు. ఇక్కడ నుంచి మా గేమ్‌ను ఎక్కువగా ఆడతారు.

దోమలను పారద్రోలే మొక్కలు ఇవే..!

వానాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం కాగానే గుంపులుగా దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇవి రాత్రిపూట నిద్రపోనివ్వవు. వీటివల్ల పలు రకాల వ్యాధులు కూడా సోకుతాయి. దోమలను నివారించేందుకు ఇంటి చుట్టూ కొన్ని రకాల మొక్కలు పెంచితే సరిపోతుంది అంటున్నారు నిపుణులు.



- ఇంటి ప్రధాన ద్వారానికి ఎదురుగా తులసి మొక్కను ఏర్పాటు చేస్తే దోమలు లోనికి రావు. బాల్కనీలు, కిటికీల గోడల మీద కూడా చిన్న కుండీల్లో తులసి మొక్కను పెంచవచ్చు.
- ఇంటి పరిసరాల్లో యూకలిప్టస్, నీలగిరి మొక్కలు పెంచితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ఈ మొక్కలు విడుదల చేసే ఘాటైన వాసనలకు దోమలు నశించిపోతాయి.
- చాలామంది దోమలు వచ్చే సమయానికి ఇంటి తలుపులు మూసేస్తూ ఉంటారు. అయినప్పటికీ బాల్కనీలు, కిటికీల నుంచి దోమలు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు ఆ ప్రదేశాల్లో వెడల్పాటి కుండీలు ఏర్పాటు చేసి పుదీనా, నిమ్మ గడ్డి, రోజ్‌మేరీ, లావెండర్, బంతిపూల మొక్కలు పెంచాలి. ఈ మొక్కల ఆకులు, పూల నుంచి వెలువడే సువాసనలు సరిపడక దోమలు దూరంగా పారిపోతాయి. ఈ మొక్కల కుండీలను ఇంట్లో అమర్చుకుంటే దోమలన్నీ బయటికి వెళ్లిపోతాయి.



- సిట్రోనెల్లా అనేది ఓ గడ్డి మొక్క. ఇది సుగంధాన్ని వెదజల్లుతుంది. ఈ మొక్కని కిటికీల దగ్గర, ఇంటి చుట్టూ గోడల వెంబడి పెంచితే దోమలు దూరంగా వెళ్లిపోతాయి.
- దోమలు ఎక్కువగా తిరిగే ప్రదేశంలో వెల్లుల్లి మొక్కను పెంచితే పది రోజుల్లో దోమలన్నీ నశించిపోతాయి.
- గుమ్మానికి ఇరుపక్కలా హార్స్‌మింట్, స్నేక్‌ప్లాంట్, ఆలియం, సేజ్, జెరేనియం మొక్కల కుండీలు పెడితే దోమలు ఇంట్లోకి రావు.
- గడ్డి చేమంతి మొక్క కూడా దోమలను పారద్రోలుతుంది. దీని పూలు పసుపు, తెలుపు, ఎరుపు, గులాబీ, ఊదా రంగుల్లో ఉంటాయి. ఇంటి ముందు వేలాడే కుండీలను ఏర్పాటు చేసుకుని వాటిలో ఈ మొక్కను పెంచితే ప్రయోజనం ఉండడమే కాకుండా పరిసరాలు అందంగా కనిపిస్తాయి.



న్యూస్‌మేకర్

ఆమె పయనం... సమున్నతం

అంజలి సూద్... భారత సంతతికి చెందిన ఈ అమెరికన్ గురించి ఇప్పుడు నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు. కారణం... ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం... 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' (పర్యవేక్షక మండలి) సభ్యురాలిగా ఆమెను ఎంపిక చేయడం. అమెరికా ఓటీటీ 'ట్యూబి' సీఈఓగా ఉన్న అంజలి... గతంలో విమియో, అమెజాన్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పని చేశారు. వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించి... లాభాల బాట పట్టించారు. 'విద్యాశక్తి ద్వారా అమ్మానాన్నలు నా గురించి కన్న కలలను నిజం చేశాను. దాన్ని రేపటి తరానికి అందించాలని కోరుకొంటున్నాను' అంటున్న 41 ఏళ్ల అంజలి విజయ ప్రస్థానం ఇది.



అమెరికాలో ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం... హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య వివాదం తీవ్రస్థాయికి వెళ్లింది. ఈ తరుణంలో అంజలి వర్సిటీ 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్' సభ్యురాలిగా ఎంపిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదవిలో ఆమె రెండేళ్లు కొనసాగుతారు. 'బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్'... హార్వర్డ్ రెండో అత్యున్నత పాలకమండలి. లిబరల్ పార్టీ నాయకుడిగా ఎన్నికైన మార్క్ కార్నే బోర్డులో తన సభ్యత్వానికి రాజీనామా చేయడంతో, ఆ ఖాళీని అంజలితో భర్తీ చేసింది వర్సిటీ. ఆమె హార్వర్డ్ పూర్వ విద్యార్థిని కూడా.

అదే వర్సిటీలో...

అంజలిది అమెరికాలో స్థిరపడిన పంజాబీ కుటుంబం. డెట్రాయిట్‌లో పుట్టిన ఆమె... ఫ్లింట్ నగరంలో పెరిగారు. పద్నాలుగేళ్ల వయసులో 'ఫిలిప్స్ అండోవర్ అకాడమీ'లో చదివేందుకు మసాచుసెట్స్ వెళ్లారు. 2005లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ పూర్తి చేశారు. 2011లో హార్వర్డ్ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. ఇప్పుడు అదే వర్సిటీ పాలక మండలిలో కీలక బాధ్యతలు చేపట్టారు.

ఉన్నత హోదాలు...

బీఎస్సీ అవ్వగానే ఉద్యోగ జీవితంలోకి ప్రవేశించిన అంజలి కెరీర్ వాయు వేగంతో దూసుకుపోయింది. 2005- 2014 మధ్యకాలంలో ఆమె సాజెంట్ అడ్వైజర్స్, టైమ్ వార్నర్, అమేజాన్‌లలో ఫైనాన్స్, మీడియా విభాగాల్లో పని చేశారు. తరువాత 'విమియో' గ్రూప్‌లో గ్లోబల్ మార్కెటింగ్ హెడ్‌గా బాధ్యతలు చేపట్టారు. మూడేళ్ల తిరక్కుండానే ఆ కంపెనీకి సీఈఓ అయ్యారు. అంజలి సారథ్యంలో కంపెనీ కంటెంట్ ప్రొడక్షన్ నుంచి కంటెంట్ క్రియేటర్లకు సాఫ్ట్‌వేర్ టూల్స్ అందించే స్థాయికి ఎదిగింది. ఎన్నడూ చూడని లాభాలను ఆర్జించింది. ప్రత్యక్ష ప్రసారాలకు ఉద్దేశించిన 'లైవ్ స్ట్రీమ్', వీడియో ఎడిటింగ్ కోసం తెచ్చిన 'మ్యాజిస్టో' యాప్‌లతో పాటు 'వైర్‌మ్యాక్స్, విబ్బిట్జ్' సాఫ్ట్‌వేర్ స్టార్టప్‌లను 'విమియో' సొంతం చేసుకోవడంలో అంజలిదే ప్రముఖ పాత్ర.

కొత్త బాధ్యతలు...

తాజాగా హార్వర్డ్ వర్సిటీ బోర్డ్ ఆఫ్ ఓవర్సీర్స్‌కు ఎంపిక కావడంతో తన కల నెరవేరిందంటారు అంజలి. 'మా అమ్మానాన్న నా గురించి ఎన్నో కలలు కన్నారు. విద్యాశక్తి ద్వారా ఆ కలలను నేను సాకారం చేయగలిగాను. దీన్ని తరువాతి తరాలవారికి అందించాలనేది నా సంకల్పం' అంటున్న అంజలి... హార్వర్డ్ అందుకు సరైన వేదికగా భావిస్తున్నారు. అంతేకాదు... ఆమె ప్రస్తుతం 'సిరియస్ ఎక్స్‌ఎమ్, డోల్బీ లేబరెటరీస్'కు బోర్డు మెంబర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'చేంజ్ డాట్ ఓఆర్జీ'కి చైర్మన్‌గా ఉన్నారు.

అందరిలో ఆసక్తి...

హార్వర్డ్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న విదేశీ విద్యార్థుల సమాచారం ప్రభుత్వానికి ఇచ్చేందుకు వర్సిటీ నిరాకరించడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీంతో అటు వర్సిటీకి, ఇటు ట్రంప్ ప్రభుత్వానికి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వర్సిటీ పాలక మండలిలో అంజలి కీలక బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె కార్యాచరణ ఎలా ఉంటుందనేదానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.

అవార్డులు ఎన్నో...

ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ 40 అండర్ 40' జాబితాలో చోటు దక్కించుకున్న అంజలి ఎన్నో అవార్డులు, గౌరవ సత్కారాలు అందుకున్నారు. 2019లో ఆమెకు 'న్యూయార్క్ ఉమెన్ ఇన్ ఫిలిమ్ అండ్ టెలివిజన్' అవార్డు లభించింది. గత సంవత్సరం 'ది హాలీవుడ్ రిపోర్టర్' ప్రకటించిన వినోద రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో అంజలికి చోటు దక్కింది. అంచెలంచెలుగా ఎదుగుతూ కెరీర్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆమె నికర ఆదాయం దాదాపు రూ.73 కోట్లు. ఇదంతా వివిధ కంపెనీలకు అందించిన సేవల ద్వారా పొందిన ప్రతిఫలం. సాధించాలన్న పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే ఏ లక్ష్యం పెద్దది కాదని అంజలి నిరూపించారు. కలలను ఛేదించి... భావితరాలకు స్ఫూర్తిమంత్రం అయ్యారు.

విజయ పరంపర...

దాదాపు పదేళ్లపాటు విమియో విజయాల్లో భాగస్వామి అయిన అంజలి... 2023లో కంపెనీ నుంచి తప్పుకున్నారు. ఆ వెంటనే ఫాక్స్ కార్పొరేషన్ నుంచి ఆమెకు పిలుపు వచ్చింది. దాని అనుబంధ సంస్థ అయిన 'ట్యూబి' సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అమెరికాలో ఉచితంగా సినిమాలు, టీవీ షోలు అందించే ఓటీటీ వేదిక ఇది. అంజలి చేరికతో కంపెనీ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. నెలకు దాదాపు పది కోట్ల మంది దీన్ని ఉపయోగిస్తున్నారంటే... అందులో ఆమె కృషి గురించి ప్రధానంగా చెప్పుకోవాలి.

శాండ్‌విచ్‌లు అందంగా...

మనం సాధారణంగా శాండ్‌విచ్‌లు చేసుకుని తింటూ ఉంటాం. ఇంటికి అతిథులు వచ్చినప్పుడు మాత్రం వాటిని అందంగా రూపొందించి చక్కగా పళ్లెంలో అమర్చాలని అనుకుంటాం. చూడగానే ఆకట్టుకునేలా శాండ్‌విచ్‌లను ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం...



- ఒక బ్రెడ్‌ను తీసుకుని రెండు త్రిభుజాకారపు ముక్కలుగా కోయాలి. రెంటినీ ఒకదాని పక్కన మరోదాన్ని కాస్త ఎడంగా పెట్టాలి. వీటిపైన పాలకూర ఆకును పెట్టాలి. దీనిమీద టమాటా ముక్కలు, ఛీజ్ తురుం, కొత్తిమీర చీలికలు, ఇతర కూరగాయల ముక్కలు (కేరట్, కీరా, బీట్‌రూట్ లాంటివి) అమర్చాలి.




- ఈ రెండు త్రిభుజాకారపు బ్రెడ్ ముక్కలను ఒకదానితో మరోదాన్ని మూసివేయాలి. లోపల ఉన్న కూరగాయల ముక్కలు పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఒక పొడవాటి ప్లాస్టిక్ కవర్‌తో ఈ రెండు ముక్కలను కలిపి చుట్టాలి.
- ఒక శాండ్‌విచ్ పేపర్‌ను తీసుకుని పొడవాటి దీర్ఘచతురస్రాకారంలో కత్తిరించాలి. ఈ పేపర్‌తో ముందుగా తయారుచేసుకున్న శాండ్‌విచ్‌ను కోన్ మాదిరి చుట్టాలి. తరవాత ఒక పళ్లెంలో జాగ్రత్తగా పెట్టాలి. శాండ్‌విచ్ పేపర్‌మీద సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఏదైనా రాయవచ్చు.



- పళ్లెంలో ఖాళీ ఉన్నట్లయితే కూరగాయల ముక్కలను అందమైన ఆకృతుల్లో పేర్చవచ్చు. అవసరమైతే మొలకలు, డ్రైఫ్రూట్స్ కూడా చేర్చవచ్చు.

ఎండుద్రాక్ష నీళ్లతో ప్రయోజనాలు



డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. అందుకే చాలామంది ఉదయాన్నే నానబెట్టిన బాదం, ఎండుద్రాక్ష తింటుంటారు. అయితే పరగడుపున నల్ల ఎండుద్రాక్ష నీళ్లను తాగడం వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..

- ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. అది అజీర్తి సమస్యలను దూరం చేస్తుంది.
- ఈ నీళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.
- ఈ నీళ్లలో సహజసిద్ధంగా ఉండే చక్కెర, కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.
- ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తహీనత దరిచేరకుండా చేస్తాయి.
- ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం బీపీని నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగిస్తాయి. దాంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- ఈ నీళ్లలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దూరం చేస్తాయి
- 10- 15 నల్ల ఎండు ద్రాక్షలను తీసుకుని నీళ్లతో బాగా కడిగాలి. ఇప్పుడు వాటిని ఓ గ్లాసుడు మంచి నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం పరగడుపున ఆ నీటిని తాగేయాలి. నానబెట్టిన ఎండుద్రాక్షలను కూడా తినేయవచ్చు.

ధర్నాను జయప్రదం చేయండి

పెదనందిపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు రైతుసంఘ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ ధర్నాలో రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదనందిపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వరగాని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామంలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా సోమవారం విద్యుత్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ కరుణాకర్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసుల నిఘాలో కానిస్టేబుల్ పరీక్షలు



కిట్స్ కాలేజీలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ భానోదయ, సీఐ రమానాయక్

వట్టిచెరుకూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పుల్లడిగుంట, శివారులో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఐదో మైలులోని ప్రియదర్శిని కళాశాల, కిట్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పోలీసు పరీక్షకేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ భానోదయ, సీఐ రమానాయక్, వారి సిబ్బంది పూర్తి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే అభ్యర్థులను ప్రధాన ద్వారం వద్దనే తనిఖీ నిర్వహించి పరీక్ష కేంద్రాల్లోకి పంపించారు.

శృంగారపురం, చిలువూరుల్లో కంటి వైద్యశిబిరాలు

దుగ్గిరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శృంగారపురంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మంగళగిరి ఎన్నారై వైద్యకళాశాల విద్యార్థులతో పాటు పలువురు కంటి నిపుణులైన వైద్యులు శిబిరానికి వచ్చిన వారిని పరీక్షించారు. కంటి పరీక్షలతోపాటుగా, సాధారణ జబ్బులు, బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. 204 మందికి పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించారు. సర్పంచ్ కొండూరు సుధారాణి, టీడీపీ నాయకులు కొండూరు ముత్తయ్య, మాజీసర్పంచ్ మొవ్వా చంద్రశేఖరరావు, యలవర్తి అంకమ్మరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిలువూరులో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అమరావతి, స్రవంతి హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 8 మంది వైద్యులు, 12మంది సిబ్బందితో 242 మందికి కంటిపరీక్షలు జరిపి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం ఎంపీటీసీ రోజమరియమ్మ, తోటకూర సీతారామయ్య, మాలెంపాటి వెంకటేశ్వరరావు, యడ్ల బాలకృష్ణ, మాజీ జడ్పీటీసీ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రౌడీషీటర్లపై పీడీ యాక్ట్

గుంటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వరుస నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముగ్గురు రౌడీషీటర్లపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. మంగళగిరి టౌన్‌కు చెందిన బుల్లా మనోజ్ (26), వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముట్లూరు గ్రామానికి చెందిన అల్లం సాయి సాంబశివరావు అలియాస్ సాయి (23), చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజండ్లకు చెందిన పోతినేని గోపీ (35) తదితరులపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఈ ముగ్గురిపై రౌడీషీట్‌లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల జిల్లా పోలీస్ అధికారులు రౌడీషీటర్‌లపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు పంపగా వాటిని ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆమోదించారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పన్నుల భారానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి : సీపీఎం

మంగళగిరి సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న పన్నుల భారానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణ సీపీఎం పార్టీ సభ్యులు, సానుభూతిపరుల విస్తృత సమావేశం చెంగయ్య అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. నేతాజీ మాట్లాడుతూ మంగళగిరి, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్లు బిగించి భారం మోపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధి కారంలోకి వచ్చినప్పటికీ ప్రజలపై భారాలను మాత్రం ఆపలేదని విమర్శించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్ మాట్లాడుతూ కూటమి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గోదావరి నదిలో మృతదేహం

● మంగళగిరి వాసిగా గుర్తింపు

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం గుర్తించారు. స్థానిక లాంచీలరేవు సమీపంలో మృతదేహం తేలిఉందని సమాచారం రావడంతో పట్టణ సీఐ వి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా గుంటూరు జిల్లా మంగళగిరి బాలాజీనగర్‌కు చెందిన మందిశెట్టి శ్రీనివాసరావు (55)గా గుర్తించారు. ఈ మేరకు ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందజేసినట్టు పోలీసులు తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది రాకుండా.. సరుకులు పంపిణీ చేస్తాం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



రేషన్ సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా సరుకులను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో రేషన్ దుకాణాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రేషన్ బియ్యం పక్కదారి పట్టిందని విమర్శించారు. వాహనాలు, డ్రైవర్లు అంటూ హడావిడి చేస్తూ పేద వానికి బియ్యం దక్కకుండా చేశారని అన్నారు. ప్రతి నెల 15రోజుల పాటు డీలర్ల నుంచి రేషన్ అందించే విధంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షిస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు తమకు అనుకూలమైన సమయానికి, ఎటువంటి ఇబ్బంది లేకుండా రేషన్ తీసుకోవచ్చని చెప్పారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ తహసీల్దారు వెంకటేశ్వర్లు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బొందలపాటి అమరేశ్వరి, కార్పొరేటర్ స్మిత పద్మజ, కూటమి నాయకులు ఇమ్మడి మల్లేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, రావిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● మన్నవ పూర్ణచంద్రరావు

వట్టిచెరుకూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ షాపుల వద్ద బియ్యం, నిత్యావసరాల సరుకుల పంపిణీ కార్యక్రమం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆయా రేషన్‌షాపుల వద్ద గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు కూటమి నాయకులు ప్రారంభించారు. వట్టిచెరుకూరులో టీడీపీ అధ్యక్షుడు యేదుబాటి శివయ్య, గ్రామసర్పంచ్ ఆరుమళ్ల విజయ్‌కుమార్, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ జెట్టి సుబ్బారావు, లేమల్లెపాడు, అనంతవరప్పాడు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు పాతూరి శివపార్వతి, దారా వెంకట్రావు, మండల టీడీపీ అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ దరియావలి, ఎంపీటీసీ నగరాజకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు పాతూరి కృష్ణారావు, గ్రామ నాయకులు, పుల్లడిగుంట గ్రామంలో ఉప్పుటూరి చినరాములు, మాజీ సర్పంచ్ గోవర్ధనరావు, ఉప్పుటూరి సదాశివరావు, వీరప్రసాద్, మన్నవ శ్రీనివాసరావు, అన్వర్, కాలీషా, కరీముల్లాలు, మేజర్ పంచాయతీ ముట్లూరులో జనసేన మండల కార్యదర్శి అల్లం రామయ్య, వెంకట్, పత్తి భావనారాయణ పాల్గొన్నారు.



పుల్లడిగుంటలో రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఉప్పుటూరి చినరాములు

సమయపాలన పాటించాలి

● తహసీల్దార్ కరుణకుమార్

ప్రత్తిపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణ దారులు సమయాపాలన పాటిస్తూ ప్రజలకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలని ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణకుమార్ సూచించారు. పాతమల్లాయపాలెంలో ఆయన రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీని ప్రారంభించారు. దుకాణదారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఎవరికి ఇబ్బందులు లేకుండా అందరికి రేషన్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, కాకాని సురేష్, కాసు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకే..

● మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ

పెదనందిపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిర్వీర్యమైన రేషన్ పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి లబ్ధిదారులకు దుకాణాల వద్దే రేషన్ పంపిణీ కార్యక్రమం చేపట్టిందని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రేషన్ దుకాణాల వద్ద రేషన్ పంపిణీని ప్రారంభించారు. పెదనందిపాడులో తహసీల్దార్ వెంకటస్వామి, నాగులపాడులో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, కొప్పర్రులో మాజీ జడ్పీటీసీ బత్తిని శారదావేణులు లబ్ధిదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు బండి నాగబాబు, నాయకులు ఆళ్ల రాజారావు, శివరామకృష్ణయ్య, బీజేపీ నేత భీమినేని రవి, అద్దంకి శివన్నారాయణ, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం పథకాల అమలుకు కూటమి కృషి

కాకుమాను, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సంక్షమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగిస్తుందని మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్ అన్నారు. కాకుమాను షాపు నెం.1లో ఆదివారం రేషన్ సరుకుల పంపీణీ కార్యక్రమం జరిగింది. మండలపరిధిలోని అప్పాపురంలో సంగండెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి, మాజీ ఎంపీపీ నూతి శరత్ బాబులు రేషన్ సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, నల్లమోతు పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చౌక డిపోల ద్వారా నిత్యావసరాలు పంపిణీకి శ్రీకారం



పెదవడ్లపూడిలో రేషన్ డిపో ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ కిరణ్‌చంద్, తహసీల్దారు తదితరులు



రేషన్ అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

మంగళగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆదివారం నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. పెదవడ్లపూడి గ్రామంలో రేషన్ డిపోను మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, తహసీల్దారు దినేష్ రాఘవేంద్రలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్‌చంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తుందన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు నేరుగా ఇంటికి వెళ్లి సరుకులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ జరుగుతుందని, ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ జరుగుతుందని, కార్డుదారులు తమకు వీలు కుదిరిన వేళల్లో రేషన్ తీసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్‌బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, అన్నే చంద్రశేఖర్, కొడవలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఎర్రబాలెం, నవులూరు గ్రామాల్లో చౌక డిపోల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి ప్రారంభించారు. తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నేతలు ఆకుల ఉమామహేశ్వరరావు, మల్లవరపు వెంకటరావు, అంకారావు, నరేష్, పానయ్య, రంగారావు, ఫిరోజ్, సత్యనారాయణ, పద్మ, రాజేశ్వరీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి 30, 31 వార్డులకు సంబంధించి తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆర్బుద భూలక్ష్మీ, కొత్తపేట 1, 2 వార్డుల్లో మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర రేషన్ పంపిణీని ప్రారంభించారు. 8వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే ప్రభుత్వ ధ్యేయం : నందం అబద్దయ్య

తాడేపల్లి (గుండిమెడ), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పద్మశాలీయ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ, చిర్రావూరు గ్రామాల్లో రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామఅధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ దండమూడి శైలజారాణి, అంకినీడు తదితరులు పాల్గొన్నారు. కాగా పెనుమాకలో తహసీల్దార్ సీతారామయ్య మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెలుగురైతు పార్లమెంట్ అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పఠాన్ జానీఖాన్, గ్రామ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్, వడ్డేశ్వరంలో ఈపూరి కోటయ్య, కుంచనపల్లిలో కానుగోలు కోటేశ్వరరావు, చిర్రావూరులో కాసరగడ్డ శ్రీనివాస్, పలుచోట్ల జనసేన నేతలు పాల్గొని రేషన్ పంపిణీ చేశారు. సీతానగరంలో తహసీల్దార్ సీతారామయ్య, ఆర్ఐ వేదాం తరావు, వీఆర్వో ప్రభాకరరావు రేషన్ పంపిణీ ప్రారంభించారు.

చౌకడిపోల వద్ద 15వతేదీ వరకూ రేషన్ పంపిణీ



జెండాచెట్టువద్ద రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీలో పాల్గొన్న తహసీల్దార్ సునీత, టీడీపీ నాయకులు

దుగ్గిరాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 15వతేదీ వరకూ చౌకడిపోల నుంచి రేషన్ పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ ఐ సునీత పేర్కొన్నారు. దుగ్గిరాలలోని జెండా చెట్టు సమీపంలో మండలంలోని పలుగ్రామాల్లోని చౌక డిపోల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 34 దుకాణాల్లో రేషన్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 65ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ అందిస్తారని తెలిపారు. రేవేంద్రపాడు, శృంగారపురం, దుగ్గిరాల, చిలువూరు తదితర 18గ్రామాల్లో జరిగిన రేషన్ బియ్యం, పంచదార పంపిణీ కార్యక్రమాల్లో మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీలు వెని గళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి, రాష్ట్రవాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, టైలర్ బాషా, ఫిరోజ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మూగజీవాలను కాపాడిన గ్రామస్థులు



ఊబిలో దిగబడిన గేదెలు

వట్టిచెరుకూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామ సమీపంలో పాత జల్లె వాగులోని ఊబిలో దిగబడిపోయిన ఐదు గేదెలను గ్రామ ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు గ్రామస్తుల సాయంతో కాపాడారు. గ్రామానికి ఆనుకుని ముట్లూరు వెళ్లే మార్గంలోని జల్లెవాగు వంతెన సమీపంలో మేత కోసం దిగి ఊబిలో కూరుకుపోయి స్పృహ కోల్పోయి ఉండడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వాటిలో రెండు దూడలు, మూడు గేదెలు ఆదివారం ఉదయం గుర్తించిన నేపథ్యంలో స్థానిక ఎంపీటీసీ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థులతో కలసి జేసీబీ సాయంతో ఊబిలో కూరుకుపోయిన గేదెలను బయటకి తీశారు.

మానసిక ఉల్లాసానికి... దేహదారుఢ్యానికి ఈత అవసరం

● సీఐడీ ఎస్పీ కే చక్రవర్తి



ప్రసంగిస్తున్న సీఐడీ ఎస్పీ కే చక్రవర్తి

తాడేపల్లి (ఉండవల్లి), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి.. దేహదారుఢ్యానికి ఈత అవసరమని సీఐడీ ఎస్పీ కే చక్రవర్తి అన్నారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 4వతేదీ నుంచి 31వ తేదీ వరకు 4 వారాలపాటు పిల్లలకు ఈత శిక్షణ శిబిరం జరిగింది. ముగింపు సభలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్విమ్మింగ్ నేర్చుకోవడానికి ఇప్పుడు అనేక సౌకర్యాలు వచ్చాయని, గోకరాజు గంగరాజు గెస్టు హౌస్‌లో స్విమ్మింగ్ పూల్ నందు ఈత నేర్చుకునే అవకాశం రావడం పిల్లల అదృష్టమన్నారు. బేసిక్ టెక్నిక్స్ నేర్చుకున్న పిల్లలకు ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఉన్న కృష్ణానదిలో ఈత నేర్పించడం చాలా గొప్ప విషయమన్నారు. ఓపెన్ వాటర్‌లో ఈత కొట్టడానికి, స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టడానికి చాలా తేడా ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు లింగి పిల్లి రామకృష్ణ మాట్లాడుతూ గోకరాజు గంగరాజు అసోసియేషన్‌కు నది పక్కన ఒక ప్లాట్ డొనేట్ చేయడం వల్ల ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించబడిందని, అసోసియేషన్‌లో స్విమ్మింగ్ పూల్ బాగా చిన్నదైనందున తమ గెస్ట్ హౌస్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో పిల్లలకు ఉచితంగా ఈత శిక్షణ శిబిరం నిర్వహించడానికి అవకాశం ఇచ్చినందున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఈత శిక్షణ శిబిరంలో 215 మంది పిల్లలకు ఈత శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్, ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయిన గంధం క్వీని విక్టోరియాను సన్మానించారు. శిక్షణ పొందిన పిల్లలకు పోటీలు నిర్వహించి, ఐలాండ్ వరకు ఈత కొట్టిన పిల్లలకు సర్టిఫికెట్లు, బహుమతులు చక్రవర్తి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి యార్లగడ్డ రమేష్, ఉపాధ్యక్షుడు జీ సాంబశివరావు, సహాయ కార్యదర్శులు రామిరెడ్డి, జనార్ధనరావు, కోశాధికారి, ఈవెంట్ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగిసిన స్విమ్మింగ్‌లో శిక్షణ



స్విమ్మింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తుళ్లూరు, (రాయపూడి), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాయపూడి కృష్ణా నది లాంచీ రేవులో విద్యార్థులకు స్విమ్మింగ్‌లో శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. శివశక్తి స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ జాతీయ అంతర్జాతీయ స్విమ్మింగ్ కోచ్ జయప్రకాశ్ నేతృత్వంలో 70 మంది విద్యార్థులకు 45 రోజుల పాటు ఉచితంగా సమ్మర్ వెకేషన్‌లో భాగంగా స్విమ్మింగ్ (ఈత)లో తర్ఫీదు పొందారు. ఆదివారం లాంచీ రేవు వద్ద ముఖ్యఅతిథులుగా పాల్గొన్న తుళ్లూరు ఎస్ఐ కలగయ్య, స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

ప్రభునగర్‌లో పేదల నుంచి అర్జీల స్వీకరణ

తాడేపల్లి టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్, ప్రభునగర్‌లలో పేదల నుంచి సీపీఐ నేతలు ఆదివారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కాశయ్య మాట్లాడుతూ పట్టణాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పండుగలా రేషన్ పంపిణీ

● రేషన్ షాపులను ముస్తాబు చేసిన డీలర్లు..



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మెహర్‌కుమార్, హనుమంతరావు

తాడికొండ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం తొలగించి పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆదివారం మండలపరిధి గ్రామాల్లోని రేషన్ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీని చేపట్టారు. రేషన్ పంపిణీకి ఆయా డీలర్లు దుకాణాలను పూలు, మామిడి తోరణాలతో ముస్తాబు చేసి స్థానిక కూటమి నేతలు, అధికారులతో పంపిణీని ప్రారంభించారు. రేషన్ తీసుకువెళ్లటానికి వచ్చిన కార్డుదారులు సైతం ఆనందం వ్యక్తం చేశారు. డిపోల్లో తమకు ఇష్టమైన రోజున తమకు నచ్చిన సమయంలో రేషన్ తీసుకువచ్చునని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల్లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రేషన్ షాపుల్లో స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు, తహసీల్దార్ కే మెహర్‌కుమార్‌లు సరుకులను కార్డుదారులకు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులతో డీలర్లు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్‌కు మార్, మైనార్టీ సెల్ నాయకులు షేక్ జఫ్రుద్దీన్, షేక్ రఫీ, బీసీ సెల్ నాయకులు ముక్కెర శీను, కనగాల కల్యాణ్‌చంద్, ఆర్ఐ నూతలపాటి హనుమంతరావు, వీఆర్‌వోలు బ్రహ్మయ్య, మాల్యాద్రి, రాంబాబులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

● తహసీల్దార్ సుజాత



పెదపరిమిలో రేషన్ బియ్యం అందజేస్తున్న టీడీపీ నాయకులు, తహసీల్దార్ సుజాత

తుళ్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి ప్రతి నెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు దిగులు లేకుండా రేషన్ కార్డుదారులు బియ్యం, సరుకులు పొందవచ్చని తహసీల్దార్ బి.సుజాత పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెదపరిమి గ్రామంలో ఆదివారం కూటమి నాయకులతో కలసి రేషన్ బియ్యం పంపిణీలో తహసీల్దార్ పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా రేషన్ పంపిణీ చేశారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. దుకాణానికి వెళ్లలేని వారికి సిబ్బంది ఇంటికి వచ్చి ఇస్తారని తహసీల్దార్ తెలిపారు. కార్యమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు, రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు టీడీపీ రైతు నాయకులు నూతలపాటి రామారావు, నీటి సంఘం అధ్యక్షుడు కర్నాటి హరిబాబు, మాజీ సర్పంచ్ భాష్యం సాంబశివరావు, పాల్గొన్నారు. దొండపాడులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నెలకుదిటి వెంకట టపతిరావు, మాజీ ఎంపీటీసీ మైనేని గిరిజా ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేశారు.

నూతన రేషన్ షాపులు ప్రారంభం

ఫిరంగిపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలపాడు, ఫిరంగిపురం, మేరికపూడి, బేతపూడి, తదితర గ్రామాల్లో గల నూతన రేషన్ షాపులను ఆదివారం ప్రారంభించారు. గుండాలపాడులో టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు చౌకడిపోను ప్రారంభించారు. ఫిరంగిపురం తదితర గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు ప్రారంభించారు. అదేగాక గుండాలపాడు గ్రామంలో నలుగురు వృద్ధులకు కొత్తపల్లి కోటేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచులు సంఘం కార్యదర్శి కంభం పెదబాబు, ఆళ్ల కృష్ణమూర్తి, సర్పంచ్ కాండ్రూ దాసయ్య వై.రామకృష్ణ, షేక్ మహ్మద్ యాకోబ్, షేక్ బికారి, చంద్రశేఖర్, వెంకయ్య, పసలా థామస్ తదితరులు పాల్గొన్నారు.



గుండాలపాడులో పింఛను పంపిణీ చేస్తున్న కొత్తపల్లి కోటేశ్వరరావు

ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం

● ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, తదితర వైసీపీ నేతలు

మంగళగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు విమర్శించారు. వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం తాలూకా గోడప్రతులను మంగళగిరి వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరంకుశ, అరాచక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. వెన్నుపోటు దినోత్సవంలో వైసీపీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పచ్చల రత్నకుమారి, ఈదులమూడి డేవిడ్‌రాజు, ఊట్ల పాలశ్రీనివాసరావు, నాలి వెంకటకృష్ణ, తాడిబోయిన శివ గోపయ్య, అమరా నాగయ్య, బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, కట్టెపోగు భూషణం తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులు ఆదివారం వెన్నుపోటు దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ ఖాసీంపీరా, రాంబాబు, భూషయ్య, నాగయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగులో దిగుబడులు అధికం



డ్రోన్ పై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

తాడికొండ (దామరపల్లి) జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పత్తి సాగులో అధిక దిగుబడులు పొందవచ్చునని కేవీకే అధినేత డాక్టర్ ఎం యుగంధర్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని దామరపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎం.గంగాదేవి మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు వల్ల డిసెంబర్ లోపు పంటను పూర్తి చేయవచ్చునని తెలిపారు. ఈ పద్ధతిలో ఎకరానికి 14 వేల మొక్కలను నాటడం వల్ల రెండు కోతలలోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. డిసెంబరు లోపే పంట పూర్తవ్వటం, గులాబి రంగు పురుగు జీవిత చక్రాన్ని తగ్గించవచ్చునని తెలియజేశారు. అనంతరం పత్తి మొదళ్లను భూమిలో కలియదున్నటం వల్ల భూమి సాంద్రత పెరుగుతుందన్నారు. వ్యవసాయంలో నూతన టెక్నాలజీ అయిన డ్రోన్లు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శివశంకర్, దీపా, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం: డీఈ

తెనాలి రూరల్,జూన్1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పట్టణ మండల గ్రామాల్లో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని గాంధీచౌక్, బోసు రోడ్డు, కొత్తపేట, రజకచెరువు, రూరల్ గ్రామంలోని అంగలకుదురు, చావావారి పాలెం, జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహాల వంటి ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఓ ప్రకటనలో కోరారు.

కొల్లిపర ఫీడర్ పరిధిలో...

కొల్లిపర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్‌ను సోమవారం నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ ఎకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక సబ్ స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయ 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు.

యువ రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, తదితరులు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యువ రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని సాగు వ్యయాన్ని తగ్గించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని శేకూరుకు చెందిన శ్రీకందా కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీ సభ్యులకు ఆదివారం వ్యవసాయ శాఖ ద్వారా కిసాన్ డ్రోన్ అందించారు. రూ.9.80 లక్షల విలువైన డ్రోన్‌ను వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 80శాతం సబ్సిడీపై అందించారు. ఈ సందర్భంగా డ్రోన్ పనితీరు, మందుల పిచికారి వలన కలిగే లాభాలను ప్రయోగపూర్వకంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ యాంత్రీకరణ ద్వారా నూనత సాంకేతికతో రైతులు సమయాన్ని ఖర్చులను తగ్గించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా చేయవచ్చన్నారు. డ్రోన్ టెక్నాలజీని గ్రామస్థాయిలో రైతులందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి సీహెచ్‌సీ సభ్యులు చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 గ్రామస్థాయి కిసాన్ సమైఖ్యలను ఏర్పాటుచేసి రైతులకు డ్రోన్‌లు అందించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే సాంకేతికతను యువ రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రామకోటేశ్వరి, మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, కూటమి పార్టీల నాయకులు, కిసాన్ డ్రోన్ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిద్దె తోటలకు విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న కృష్ణదేవ్

తెనాలి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మిద్దె తోటలు పెంచుతున్న వారికి సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం విత్తనాలు పంపిణీ చేశారు. పట్టణంలోని చినరావూరులో వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పండించేందుకు గాను వందమందికి గ్రూపు నిర్వాహకులు సూర్యదేవర కృష్ణదేవ్ విత్తనాలు అందించారు. డాబాలపై గార్డెన్‌లు ఏర్పాటుచేసి అందులో రకరకాల మొక్కలను పెంచుతూ ఇంటి అవసరాలు తీర్చుకోవడమే కాకుండా ఇంటి లోపల కూడా చల్లదనం ఉంటుందని చెప్పారు. మొక్కల పెంపకానికి అవసరమైన వర్మి కంపోస్టు కూడా అందజేశారు. రాధిక, జ్యోతి, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ

● సబ్ కలెక్టర్ సంజనా సింహా

కొల్లిపర, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకులను వృద్ధులకు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తూములూరు, అత్తోట గ్రామాల్లో డీలర్ల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. రేషన్ కార్డుదారులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధుల ఇంటి వద్దకు వెళ్ళి రేషన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజనా సింహా మాట్లాడుతూ వృద్ధులు ఆందోళన చెందనవసరం లేదని డీలర్లు ఇంటి వద్దకు వచ్చి రేషన్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఎవరికైనా వేలు ముద్రపడకపోతే ఐరిస్‌తో రేషన్‌ను పంపిణీ చేస్తారన్నారు. రేషన్‌కార్డు దారులు డీలర్లకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఆర్ఐ వంశీకృష్ణ, నాయకులు అడపా నారాయణరెడ్డి, కె.కిశోర్‌రెడ్డి, దాసరి నరసయ్య, కొఠారు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



తూములూరులో వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహా



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలిలో పోలీసు వ్యవస్థ బాగా పనిచేస్తోంది

● మంత్రి మనోహర్‌కు తెలిపిన మహిళలు

తెనాలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో పోలీసు వ్యవస్థ బాగా పనిచేస్తుంది.. గతంలో గంజాయితో ఈ ప్రాంతంలో అనేక కుటుంబాలు సర్వనాశనమైపోయి ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉండేదని యడ్లలింగయ్య కాలనీలోని పలువురు మహిళలు మంత్రి మనోహర్‌కు తెలిపారు. శనివారం మంత్రి మనోహర్ తెనాలిలోని యడ్లలింగయ్య కాలనీలో పింఛన్ పంపిణీకి వెళ్లిన క్రమంలో కాలనీ ప్రజల యోగక్షేమాలను విచారించారు. ఈ క్రమంలో పలువురు మహిళలు మంత్రికి పోలీస్ వ్యవస్థ చక్కగా పనిచేస్తుండటంతో ప్రశాంత వాతావరణంలో జీవించే అవకాశం కలిగిందని తెలిపారు. గతంలో గంజాయికి బానిసలైన యువకులు పగలు రాత్రి తేడాలేకుండా సంచరిస్తూ గొడవలకు దిగేవారని వారి ఆగడాలతో భయాందోళనకు గురైన పరిస్థితిని చూశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రశాంత వాతావరణం నెలకొందని వివరించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ఎవ్వరు పాల్పడినా సరే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం గంజాయి, రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ జీవించాలన్నదే తమ అభిమతమని అందుకు ఎక్కడా కూడా వెనుకడుగు వేసేదే లేదని మంత్రి స్పష్టం చేశారు. పలువురు కూటమి నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఆదివారం రేషన్ దుకాణాల వద్ద సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రారంభించారు. చేబ్రోలు మండలంలోని పాతరెడ్డిపాలెం పొన్నూరు పట్టణంలోని ఎస్పీపీ రోడ్డులో రేషన్ దుకాణాల వద్ద సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డోర్ డెలివరీ పేరుతో అనేక అక్రమాలు జరిగాయాని ఆరోపించారు. వైసీపీ పాలకులు నియోజకవర్గాన్ని రేషన్ మాఫియాకు అడ్డాగా చేశారని ఆరోపించారు. గతేడాది కాలంగా పొన్నూరు నియోజకవర్గంలో రేషన్ మాఫియాను పూర్తిగా అరికట్టినట్టు చెప్పారు. రేషన్ సరుకుల పంపిణీ విషయంలో అవకతవకలు పాల్పడితే కఠినంగా వ్యవహరించనున్నట్లు ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, రేషన్ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం పెదకాకానిలో చౌక ధరల దుకాణంలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని మండలం పెదకాకాని సదాశివ కాలనీలో ఏరియాలో వున్న రేషన్ షాపు 15, నగరపాలెంలో వున్న రేషన్ షాపు 14లలో చౌక ధరల దుకాణంలో లబ్ధిదారులకు సరుకులు ఆయన చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, బోయపాటి సుభేష్, ముద్రబోయిన బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్వాగతిస్తున్నారు

● సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కేసన

తెనాలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): డీలర్ల ద్వారా పారదర్శక విధానంలో రేషన్ సరుకుల పంపిణీని ప్రజలు స్వాగతిస్తున్నారని స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు చెప్పారు. ఆదివారం మండల వ్యాప్తంగా చౌక ధరల దుకాణాల్లో రేషన్ సరుకుల పంపిణీ అట్టహాసంగా ప్రారంభమైంది. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ పంపిణీకి రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కేసన కోటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో రేషన్ సరుకులు వాహనాల ద్వారా పంపిణీతో కార్డుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారన్నారు. కార్డుదారుల్లో ఎక్కువగా పేదలేనని ప్రతిరోజు కుటుంబపోషణకు జీవనోపాధికి వెళ్లాల్సి ఉండటంతో బియ్యం తీసుకునేందుకు వాహనాల కోసం కూలి వదులుకుని ఎదురుచూసే పరిస్థితి ఉందన్నారు. వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేయడం ద్వారా ఎప్పుడొస్తారో తెలియక కూలి పోగొట్టుకుని పడిగాపులు కాసే పరిస్థితి ఉండటంతో ఆ విధానాన్ని తొలగించడం జరిగిందన్నారు. ఇందులో ఎటువంటి రాజకీయ కక్షకాని, మరొకటి కాని లేదన్నారు. కేవలం లబ్ధిదారుల శ్రేయస్సుకోసం మాత్రమే తిరిగి డీలర్ల ద్వారా పంపిణీకి పూనుకున్నామన్నారు. చౌక ధరల దుకాణాల వద్ద కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో లబ్ధిదారులకు బియ్యం, ఇతర సరుకులు అందించేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15 వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 8 వరకూ అవకాశం ఉన్న ఏ సమయంలోనైనా కుటుంబంలో కార్డుదారుల్లో ఏ ఒక్కరైనా వెళ్లి బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేసి సరుకులు పొందవచ్చన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు నేరుగా ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందించడం జరుగుతుందన్నారు. తొలిరోజు పలు చౌకధరల దుకాణాల్లో రేషన్ పంపిణీని పరిశీలించి స్థానికుల అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగిందని అందరూ సంతృప్తి వ్యక్తం చేశారని కేసన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ సర్పంచ్‌లు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



కొలకలూరులో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న సర్పంచ్ డాక్టర్ ప్రీతి, కేసన కోటేశ్వరరావు

వీలున్నప్పుడు సరుకులు తెచ్చుకునే అవకాశం

● ఇన్‌చార్జి కలెక్టర్ ఏ భార్గవతేజ

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చౌక ధర దుకాణాల్లో ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులు వీలున్నప్పుడు నిత్యా వసర సరుకులు తెచ్చుకునే అవకాశం కల్పించామని ఇన్‌చార్జి కలెక్టర్ ఏ భార్గవతేజ తెలిపారు. తూర్పు నియోజకవర్గం పరిధిలో వసంతరాయపురం లోని చౌక ధరల దుకాణం నెం.61ను ఆయన పునఃప్రారంభించి, కార్డుదా రులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణాల నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ-పోస్ మిషన్ ద్వారా రైస్‌కార్డుదారుల అథెంటిఫికేషన్ తీసుకొని బ్లూటూత్ అనుసంధానమైన వేయింగ్‌స్కేల్ ద్వారా ఖచ్చితమైన తూకంతో సరు కులను పంపిణీ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహసీల్దార్ మహబూబ్ సుభాని, సీఎస్‌డీటీ భాస్కర్, చౌక ధరల దుకాణం నిర్వాహకులు పాల్గొన్నారు.



కాలువలో పూడికతీత పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

కాలువల పూడికతీత పనులు ప్రారంభం

తెనాలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యంతో పూడిపోయిన కాలువలకు మోక్షం లభిస్తోంది. మండలంలోని కాజీపేట దగ్గర హైలెవెల్ చానల్ మూడో నెంబర్ బ్రాంచ్ మరమ్మతుల పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇటీవల గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గ్రామంలోని రైతులు తమ పంట పొలాలకు నీరందక గత ఐదేళ్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని కాలువలు పూడికతీయించి సకాలంలో సాగునీరందేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన కొలకలూరు, కాజీపేట గ్రామాల్లోని పంట కాలవలు పూడిక తీయించేందుకు రూ.5లక్షల70వేలు కేటాయించారు. దీంతో ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఎక్స్‌కవేటర్లతో పంట కాలువల పూడికతీత పనులు వేగవంతమయ్యాయి. కూటమి ప్రభుత్వం రైతాంగానికి మేలు చేసేలా కాలువల పూడికతీత పనులపై దృష్టిపెట్టడంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కూటమి నాయకులు పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఇవాంజలికి ఎమ్మెల్యే పరామర్శ



ఇవాంజలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు తెలుగుదేశం పార్టీ నాయకురాలు కూచిపూడి ఇవాంజిలిని ఆదివారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరామర్శించారు. చేబ్రోలు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసిన ఇవాంజలి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ఇవాంజలి గృహానికి వెళ్లి ఆమెను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నరేంద్ర వెంట కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.



పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో లక్ష హనుమాన్ చాలీసా పత్రాలను సమర్పిస్తున్న భక్తులు

ముగిసిన హనుమత్ జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులో నిర్వహిస్తున్న హనుమత్ జయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో 17వ హనుమత్ జయంతి, లక్ష హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలను ముగింపు చేశారు. భక్తులు హనుమాన్ చాలీసా రాసిన పత్రికలను అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆగమ పండితులు నాగమారుతీ విశేష పూజలతో స్వామివారికి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు కిరణ్‌కుమార్, హరిప్రసాద్, కౌన్సిలర్లు త్రిమూర్తి, యుగంధర్, హరేరామ్, విఖనస ట్రస్ట్ సభ్యులు బాలకృష్ణ, చంద్రశేఖర్, మాజేటి వెంకటేష్, శివప్రసాద్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రియాంక

మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి

● డాక్టర్ ప్రియాంక

తెనాలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చలి, అధిక జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలను గుర్తిస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా జిల్లా ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ఇవి మలేరియా లక్షణాలై ఉండవచ్చని డాక్టర్ వేముల ప్రియాంక చెప్పారు. ఈ నెల 1 నుంచి 30 వరకూ జరిగే మలేరియా నివారణ మాసోత్సవాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీగా వెళ్లి పురప్రజలకు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ నీటిని నిల్వ ఉంచడం ద్వారా దోమలు వ్యాపించి ఆ నీటిని తాగడం లేదా దోమల కాటుకు గురైన వారికి మలేరియా వ్యాధి బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాల పరిశ్రుభ్రతలు పాటిస్తూ కాచిచల్లార్చిన నీటిని తాగడం, వేడి వేడి ఆహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిబారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సహాయ మలేరియా అధికారి వంగలపూడి పున్నారెడ్డి, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, పలువురు మలేరియా శాఖ అధికారులు, పలువురు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రౌడీషీటర్లపై పీడీ యాక్ట్

● ఇన్‌చార్జ్ కలెక్టర్

గుంటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వరుస నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముగ్గురు రౌడీషీటర్‌లపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. మంగళగిరి టౌన్‌కు చెందిన బుల్లా మనోజ్ (26), వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముట్లూరు గ్రామానికి చెందిన అల్లం సాయి సాంబశివరావు అలియాస్ సాయి (23), చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజండ్లకు చెందిన పోతినేని గోపీ (35) తదితరులపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఈ ముగ్గురిపై రౌడీషీట్‌లు ఉన్నట్లు పోలీసులు తెలి పారు. ఇటీవల జిల్లా పోలీస్ అధికారులు ఆయా రౌడీషీటర్‌లపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు పంపగా వాటిని ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్‌తేజ ఆమోదించారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

● రాష్ట్ర రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజిబాబు

తెనాలి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో ఎవ్వరూ కూడా గొప్పవారు కాలేరని కేవలం మంచి విద్యనభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించి చరిత్రలో గుర్తింపు తెచ్చుకోగలరని రాష్ట్ర రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పి.అంజిబాబు చెప్పారు. ఆదివారం పట్టణంలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ (ఆర్‌వీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సంఘీయుల విద్యార్థుల అభినందన సభ పోత్సాహక బహుమతులు పంపిణీ కార్యక్రమం సందడిగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజిబాబు హాజరై మాట్లాడుతూ రజకులందరూ ఆర్థికంగా సామాజికంగా పేరు ప్రఖ్యాతలు పొందాలంటే కేవలం పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దుకున్న నాడే ఇది సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు కూడా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి మంచి విద్యావంతులుగా ఎదగాలన్నారు. ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతూ 585 మార్కులతో ఉత్తీర్ణులైన సంఘస్థుల పిల్లలను చూస్తే గర్వంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా మంచి విద్యనభ్యసించి గొప్పస్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు విద్యకు అయ్యే ఖర్చును సంఘం భరించేలా కార్యచరణతో ముందుకు సాగుతుందన్నారు. పిల్లలను చదివించడంలో ఎక్కడా కూడా సంఘస్థులు రాజీ పడవద్దని భావితరాల్లో రజకులకు గుర్తింపు తెచ్చేది విద్య ఒక్కటేనని గుర్తించాలన్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులుగా సంఘస్థులు భవిష్యత్తులో ముందుండాలని ఏ రంగంలోనైనా అగ్రస్థానంలో నిలిచేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన సంఘపెద్దలపైనే ఉందని స్పష్టం చేశారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా నగదు, నూతన వస్త్రాలు, స్టడీ ఛైర్, పరీక్ష ప్యాడ్స్ తదితర విద్యాసామగ్రిని అందించి మెడల్స్‌తో ఘనంగా సత్కరించారు. పోతర్లంక ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి మహాలక్ష్మి పతి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న సంఘ నాయకులు

గుంటూరులోనే పంచకర్మ ఆయుర్వేద వైద్య సేవలు

● కేరళ ఆయుర్వేద నిపుణులు కొండా వెంకటేశ్వర్లు



నాడీ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పంచ కర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని, కేరళ వారి అనుబంధంతో అన్ని సదుపాయాలతో వంద పడకల సామర్థ్యంతో గుంటూరులోనే ఆయుర్వేదిక్ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఛైర్మన్, ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యనిపుణులు, డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం వెనిగండ్ల బోసుబొమ్మ సెంటర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వెనిగండ్ల గ్రామ సర్పంచ్ వేల్పుల శ్రావణి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పురాతనమైందని, అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఈ వైద్య విధానంలో చక్కటి పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ మోనిక, డాక్టర్ రాహుల్ చంద్ర, రోగుల బీపీ, షుగర్ పరీక్షలతో పాటు నాడీ పరీక్షలు జరిపారు. మోకాళ్ల నొప్పులతో బాధపడే వారికి అక్కడే అభ్యంగనం చేయించారు. శిబిరంలో 150మంది రోగులు వైద్యసేవలు పొందగా, వీరికి రూ.లక్ష విలువైన మందులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండమడుగుల శ్రీనివాస్ రెడ్డి, మున్నంగి సాంబిరెడ్డి, గుదిబండి సాంబిరెడ్డి, కొండమడుగుల సుబ్బారెడ్డి, హాస్పిటల్ మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.